# గానకళ

సంగీత మాసపత్రిక

#30-1-29, రంగయ్యనాయుడు వీధి, కాకినాడ - 533 001, సెల్: 9441488721



సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాథరావు**

విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి.బ్రహ్మానందం,**

విజయవాడ, విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

అసోసియేట్ ఎడిటర్స్

**శ్రీ ధర్మాల రామమూర్తి**

(హైదరాబాద్)

**డా॥ బి.యస్.వి.ప్రసాద్,**

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ మృదంగం

కాశీవిశ్వవిద్యాలయం, వారణాసి.


**సంపుటి -59** **జనవరి - 2022** **సంచిక - 8**


**సంపాదకవర్గం :**

శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
శ్రీ నేమాని సోమయాజులు
శ్రీ తాతపూడి వెంకట సుబ్బరాయ శాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి.వర్ధని
శ్రీమతి మల్లాప్రగడ జోగులాంబ
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్.వి.సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**

శ్రీ ఎం.ఎస్.శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్.అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మీదేవి, M.A.,M.A.,M.A.
శ్రీమతి వై. రమాప్రభ, ,M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి.రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై.శేషురాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి


పేజిలలో ఈ సంచికలో...


2. సంగీతం ఎందుకు రాదు? - శ్రీ మల్లాది సూరిబాబు
5. నాదకోవిదులు చినమౌలానా - శ్రీ మోదుమూడి సుధాకర్
7. *Brief Pen Picture of Shri NallanChakravartula Krishnamacharyulu* –శ్రీమతి నాగలక్ష్మి మండా
10. సంగీతం మన ఆరోగ్యం - శ్రీమతి ఎస్.సల్మా
11. శ్రీరామ సమాజం, కాకినాడ - సంగీత సభ
12. సర్వం 'నాదమయం' మా గురుకుల వాసం నేదునూరి కృష్ణమూర్తి గారితో మల్లాది సోదరుల అనుభవసారం
25. నేను బాలు, కొన్ని జ్ఞాపకాలు - శ్రీ తనికెళ్ళ భరణి
28. నేమాని అంతరంగం - శ్రీ జె.ఎస్.శాస్త్రి
34. సంగీత సభల కార్యకలాపములు - విహారి


## ముఖచిత్రం

1. విశాఖ మ్యూజిక్ అకాడమీ, విశాఖ వారి 52వ వార్షికోత్సవాలలో సన్మానం పొందుతున్న వీణావిద్వాంసులు శ్రీ అయ్యగారి శ్యామ్‌సుందర్.
2. విశాఖ మ్యూజిక్ అకాడమీ, విశాఖ వారి 52వ వార్షికోత్సవాలలో అవార్డు అందుకొన్న విదుషి శ్రీమతి కె.వందన.
3. అనపర్తి శ్రీ శారదా సంగీత కళాసమితిలో పంచరత్న కీర్తనల బృంద గానం చేసిన కాకినాడ సంగీత విద్వాంసులు.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

# సంగీతం ఎందుకు రాదు?

– మల్లాది సూరిబాబు

సంగీతం పేరు చెబితే సప్తస్వరాలు మనసులో మెదులుతాయి. ఎవరు మాట్లాడినా సాహిత్యం ఆలోచనామృతం, సంగీతమాపాత మధురం లాంటి మాటలు వింటూనే ఉంటాం.

సంగీతం గురించి తెలియకపోయినా, పాడక పోయినా మాట్లాడటం ఎంతో తేలిక. ప్రపంచంలో సంగీతమంతా ఏడు స్వరాల్లోనే ఉంది. షడ్జ,పంచమాలు, మినహాయిస్తే మిగతా స్వరాలు తేలికగా పట్టుకోవడం కష్టం. శ్రద్ధగా కూర్చుని ఏకాగ్రతతో పాడే ప్రయత్నం చేస్తే షడ్జ, పంచమాలు దొరుకుతాయి. స్థాయి నిలిపి ఈ రెండు స్వరాలు దమ్ము పట్టి, కాసేపు పాడేప్రయత్నం చేస్తూ, శృతిలో నిక్కచ్చిగా వున్నాయనే నమ్మకం కుదిరితే నేర్చుకోవడానికి ముందుకు సాగవచ్చు. హాయిగా ఊపిరి తీస్తూ, నిలకడగా స్థాయి నిలుపుతూన్నప్పుడు ఎదురుగా గురువుండాలి. ఎలా పాడాలో తెలియాలిగా? మనం వాడే మందు మీద 'వైద్యుల సలహా మేరకు వాడండి' అని సూచన ఉంటుంది చూడండి. సంగీతానికి కూడా సమర్థుడైన డాక్టర్ లాంటి గురువు ఉండాలి. డాక్టర్లు మనతో చాలా మితంగా మాట్లాడతారు. సంగీత గురువులు కూడా అంతే. అలా, మితంగానే మాట్లాడాలి. అమితంగా పాడాలి. పాడించాలి.

దేవాలయంలో అర్చకులు దర్శనానికి వచ్చిన వారందరికీ శటారితో అనుగ్రహిస్తూ, తీర్థ ప్రసాదాలిచ్చి పంపించినట్లుగా వైద్యులు కూడా అందరికీ వైద్యం చేసి పంపుతుంటారు.

చిన్న చిన్న రుగ్మతలున్నా, రోగనిరోధక శక్తి వున్న వాళ్ళకి వైద్యం తేలిక. సాధనకు తట్టుకోగల వారికి సంగీతం కూడా తేలిక. యోగ్యత కలిగిన వారు ఎందరో ఉంటారు. సంగీత యోగం వున్నవారు తక్కువగా వుంటారు. పద్ధతిగా నేర్చుకోక పోయినా, పసందుగా పాడేవారంతా అదృష్ట వంతులు.

స్వరం, స్వర స్థానం అని రెండుంటాయి. కర్ణాటక సంగీతంలో, కొన్నికొన్ని స్వరాలు పక్క స్వరం నుంచి వస్తాంటాయి. కొన్ని స్వరాలు పొడి పొడిగా వినిపిస్తూంటాయి. ఈ రెండిటికీ వున్న తేడా తెలియాలి. పక్క స్వరంతో పాడే స్వరం ఎప్పుడూ బరువుతో తూకంగా వినిపిస్తుంది. అలా తయారైన పాటకు ఆకర్షణ ఎక్కువ. ఈ జ్ఞానం ఒక్కసారి చెప్పగానే రాదు. పాడగా పాడగానే వస్తుంది. అందుకే పాడుతూ, చెప్పే గురువు దొరకాలి. అనుభవంలోకి వచ్చేంతవరకూ పాడాలి.

అందుకే త్యాగయ్య 'సీతావర సంగీత జ్ఞానము ధాత వ్రాయవలెరా!' అంటారు. పిసినారిగా పేరు పొంది పిల్లి క్కూడా బిచ్చమేయని వజ్రాల వ్యాపారం చేసే పురందర దాసునకు సంగీత యోగం పట్టడం విధాత చేసిన పనే – అంతేనా? 'కర్ణాటక సంగీత పితామహుడయ్యాడు. 'నవకోటి నారాయణి'గా పిలవడే ఈ మహానుభావుడు అన్నీ వదిలేసి సంగీతాన్ని పట్టుకున్నాడు. అందుకే ఓ కవి... 'ధనమా! నిత్యము కాదు, వైభవమబద్ధంమౌ, శరీర స్థితుల్ క్షణికంబుల్, స్థిరమొక్కటే జగమునన్, సంగీత సాహిత్య సంజనితానంద సుధా ప్రవాహము విశిష్ట ప్రాజ్ఞులీ వెల్లువన్, తనువుల్ ముంచి పవిత్రులౌదురు సుధాధారాబ్ధినిన్గ్రోలుచున్' అన్నాడు.

పురంధర దాసు మొత్తం, సంగీత లోకాన్నే తరింప జేశాడు. ఆయన పిళ్ళారి గీతాలతో ప్రారంభించిన సంగీతం విశ్వవ్యాప్తమై, పాడేవారందరికీ భుక్తికీ, ముక్తికీ లోటు లేకుండా చేస్తోంది.

సంగీతానికి మూలాధారాలు రెండే రెండు. అందరికీ తెలిసినవే. ఒకటి శృతి, రెండోది లయ.

స్వర స్థానాలు ఉనికిని మనస్సే గ్రహించాలి. దగ్గర దారులు ఏమీ వుండవు. కొలిచే సాధనాలంటూ ఏమీ ఉండవు. ఉన్నా తాత్కాలికమైనవే.

'షడ్జ', 'పంచమాల' దారిని చెయ్యి పట్టుకుని చూపించే ప్రయత్నం చేసేది గురువు. ఒక్కోసారి గురువును అడ్డం పెట్టుకుని, వారంతట వారే ఒక్కసారి చెప్పగానే దారి తెలిసి,మిగతా స్వరాలను జాగ్రత్తగా పాడేసేవారుంటారు. ఆ శిష్యులకు సంగీత మార్గం సుగమమై పోతుంది. అలాటి ప్రజ్ఞ వున్న వారికి సంగీతం స్వాధీనమయ్యే అవకాశాలు మెండు.

రిషభం, గాంధారం, మధ్యమం, ధైవతం, నిషాదాదులన్నీ కోలాహలంగా కనిపించే స్వరాలే. పైగా వాటిలో చాలా రకాలు. ఇవన్నీ పక్క స్వరంతో ప్రకాశిస్తూ వుంటాయి. పాశ్చాత్య సంగీతంలో స్వరాలకు పక్క స్వరాల సహాయం ఉండదు. సమూహంగా కనిపిస్తాయి. ఒంటరిగానే వినిపిస్తూంటాయి. గమకాలుండవు అదీ తేడా.

సంగీతం పట్ల భక్తి గౌరవాలుండి, నియమ నిష్ఠలతో సంగీతాన్ని ఉపాసించిన సద్గురువులు, చాలా కొద్దిమంది ఉంటారు. ప్రతి వారినీ కూర్చోబెట్టి, వాళ్ళు పాఠం చెప్పరు. సంగీత మూర్తి త్రయంలో చిన్నవాడైన ముత్తుస్వామి దీక్షితుల వారు అఖండ జ్ఞాన స్వరూపుడు. సంగీతం ఒక్కటే కాదు. ఆయన సంస్కృతాంధ్రములలో పండితుడు. గొప్ప వాగ్గేయకారుడు. ముద్దు కుమారస్వామి వరప్రసాదిగా జన్మించిన కారణజన్ముడు.

కృతులుపాడగలిగే స్థాయి కల్గిన వారు మాత్రమే ఆయన శిష్యరికం చేసేవారు.

మరో వాగ్గేయకారుడు శ్యామశాస్త్రి. ఆయన కొడుకు సుబ్బరాయశాస్త్రి. త్యాగయ్య వద్ద కూడా సంగీతాన్ని అభ్యసించారు. ఈయన కీర్తనలు రాశిలో తక్కువే. వాసిలో గొప్పవి. సంగీతత్రయం తర్వాత అంతవాడుగా చెప్పుకోతగిన వాడు.

మిగతా వారందరికంటే త్యాగరాజుకున్న శిష్య ప్రశిష్య పరంపర ఎక్కువ. వీణకుప్పయ్యర్, మానాంబుచావిడి వెంకటసుబ్బయ్య, తిరువత్తియూర్ త్యాగయ్య, పల్లవి శేషయ్య, వాలాజీపేట వెంకటరమణ భాగవతులు వంటి వారితో పాటు మైసూర్ సదాశివరావు, పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, సుందర భాగవతార్, కృష్ణ భాగవతార్ మొదలైన వారు గురువులకు పేరు తెచ్చి, వారు కీర్తిని పొందారు.

చెప్పగలిగే స్తోమత కలిగి శిష్యుణ్ణి మనస్ఫూర్తిగా తీర్చి దిద్దగలిగే గురువులే సంగీతాన్ని వృద్ధి చేసి, విద్వాంసుల్ని తయారు చేస్తారు. సంగీతం పట్ల అభిరుచి ఒక్కటే సరిపోదు. అర్హత వుండాలి. గురువు యందు పూర్తి నమ్మకం ఉండి, 'నీవే తప్ప ఇతః పరంబెరుగ' అన్న భావన కలిగి, గురువును తల్లీ, తండ్రిగా భావించాలి.

ఆసక్తి గల తల్లిదండ్రులు పిల్లల్ని చూపిస్తూ, 'విన్న సినిమా పాట అచ్చం అలాగే, ఏమీ తేడా లేకుండా పాడేస్తాడండీ – పాటలంటే బాబుకి ఎంత పిచ్చో!" అంటూ గురువులకు పరిచయం చేస్తూంటారు. అటువంటి వారి సంగీతం బుద్ధిగా కొన్నాళ్ళు సాగినా, ఆ తర్వాత మళ్ళీ మనస్సు తేలికైన ఆ పాటల వైపే పోతుంది.

తెలిసిన దానితో తృప్తి పడతారు. తెలియనిది అలా మిగిలే ఉంటుంది. 'రానిది రాదు. పోనిది పోదు' అంటారందుకే త్యాగయ్య.

'మా ఊళ్ళో ఓ సంగీతం మాష్టారుండేవారు. ఎంతో శ్రద్ధగా నేర్పేవారో?' కొన్నాళ్ళు బాగా పాడేదాన్ని. సంసారంలో పడ్డ తర్వాత నేర్చుకున్న సంగీతం కాస్తా అటకెక్కిందని' వాపోయేవార్ని ఎందరినో చూస్తూంటాం.

డాక్టర్లు కావలసిన వాళ్లు యాక్టర్లు,యాక్టర్లవ వలసిన వాళ్ళు డాక్టర్లూ ఉంటూనే ఉంటారు.

సంగీతం ఏదో ఆషామాషీగానో, కాలక్షేపంగానో నేర్చుకునేది కాదు, నేర్పేదీ కాదు. కొందరి ప్రవృత్తులకూ, వృత్తులకూ సంబంధం ఉండదు. లక్ష్యసాధనకు అవరోధాలెక్కువ. ఆనాటి రోజుల్లో కొన్ని దశాబ్దాల పాటు తన మధురమైన కంఠంతో యావద్భారత దేశంలోని

సంగీత అభిమానులకు అలరించిన ఎ.ఎల్.సైగల్ (కుందన్‌లాల్ సైగల్) గాయకుడవక ముందు, టైపు మిషన్లు బాగు చేస్తూ ఉండేవాడంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఏ మాత్రం సంబంధం లేని వృత్తి అది.సుస్వర సంగీతానికి అడ్డుకాలేదు.

పాకిస్తాన్‌లో, ఘుజల్ చక్రవర్తి మోహదీహసన్ ఓ కారు మెకానిక్‌గా కాలక్షేపం చేసేవాడు. ఏ వృత్తిలో వున్నా, ప్రవత్తి బలంగా ఉంటే లక్ష్య సాధన కష్టం కాదు అని నిరూపించారు.

దక్షిణహిందుస్థానంలో సంప్రదాయ సంగీత బాణీల రుచిని చూపించిన ప్రముఖ సంగీత దర్శకుడు నౌషద్ అలీ – హార్మోనియాలు రిపేరు చేసే షాపుల్లో ఎక్కువ కాలం గడిపేవాడు. శృతి, మాధుర్యపు రుచిని అనుభవించేవాడు. ఆయన వృత్తి, ప్రవత్తీ రెండూ ఏకమయ్యాయి. నంగీతానందాన్ని కడుపారా అనుభవించి ధన్యుడయ్యాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో!

సుప్రసిద్ధ సంగీత దర్శకుడు కె.వి. మహదేవన్ బాల్యంలో – దేవాలయాల్లో వినిపించే డోలు వాద్యంలోని లయం, సౌందర్యానికి, నాదస్వర వాద్యానికి ఆకర్షితుడౌతూ, గంటలకొద్దీ రోజూ, ఆలయాల్లోనే కూర్చుని లయను వింటూండేవాడు.

తమిళ సినిమా రంగంలో నేపథ్య గాయకుడిగా, నటుడుగా ప్రఖ్యాతి చెందిన ఎం.కె.త్యాగరాజ భాగవతార్ – బంగారు నగల తయారీలో సిద్ధహస్తుడట.

తేనె, పంచదార, చెఱకు రసం వంటి అమృత తుల్యమైన పదార్థాలతో పోల్చతగినవి ఆయన పాటలు – ఒక తరాన్ని ఊపేశాయి.

పశ్చిమగోదావరి జల్లా పాలకొల్లులో పుట్టి పెరిగి బాల మేధావిగా పేరు సంపాదించి, మాండలిన్ వాద్యాన్నే ఇంటిపేరుగా చేసుకున్న 'పద్మశ్రీ' శ్రీనివాస్, తండ్రితో పెళ్ళిళ్ళకూ, శుభ కార్యాలకూ బ్యాండ్ మేళంతోపాటు అందర్నీ ఆకర్షించేవాడు. చెంబై వైద్యనాథ భాగవతార్ శిష్యుడైన రుద్రరాజు సుబ్బరాజు అనే సంగీత విద్వాంసుడు శ్రీనివాస్‌కు మార్గదర్శక గురువై, మద్రాసుకు తీసుకుపోయాడు. సంగీత విద్వాంసుల మధ్య తిప్పాడు. సంప్రదాయ సంగీతం పట్ల శ్రీనివాస్‌కు చిన్నతనంలోనే 'రుచి' ని కల్గించాడు. సినిమా పాటలే వాయిస్తూ ఉండి ఉంటే ఇంత పేరెక్కడ? గమకాలు పలికించే వీలులేని ఒక చిన్న వాద్యాన్ని స్వాధీనం చేసుకుని సంప్రదాయ సంగీతంతో, అత్యున్నత శిఖరాలధిరోహించిన మాండలిన్ శ్రీనివాస్, సంగీత రంగంలో ధృవతారగా నిలిచిపోయాడు. పాశ్చాత్య సంగీత విద్వాంసులతో కలిసి దేశ విదేశాలలో చేసిన సంగీత కచేరీలు, పొందిన సత్కారాలు, సన్మానాలు అసంఖ్యాకం. సంగీతం కోసం, ముఖ్యంగా మాండలిన్ కోసం పుట్టి, ఐదు పదులు నిండకుండానే సంగీత లోకం నుంచి నిష్క్రమించాడు.

సంకల్ప బలం గట్టిగా ఉంటే సాధించలేనిది ఏమీ వుండదని నిరూపించాడు. పాడిన కొద్దీ పేరిగేది రాగం. నేర్చిన కొద్దీ పెరిగేది జ్ఞానం. శ్రీనివాస్ వయసుతోబాటు జ్ఞానం కూడా పెరిగి విశ్వ వ్యాప్తమైంది. సంగీతంలో, అందరూ కారణజన్ములు అవ్వరు. సంగీత విభూతి లభించిన వారికి సద్గురు వొక్కడే దిక్కు. ఈశ్వరుడే గతి. గురువు చెప్పే దానికంటే శిష్యుడు వింటూ, సాధనతో సంపాదించేదే ఎక్కువ.

మాండలిన్ శ్రీనివాస్ లాంటి వాళ్ళను ఈ తరం ఆదర్శంగా తీసుకుంటూ సాగితే, చేసే సాధనకు అర్థం సంగీత పరమార్థం బోధపడ్తుంది. సంప్రదాయ సంగీతం నేర్చు కునేందుకు రాజమార్గం ఒక్కటే. కష్టమైనా, యిష్టంగా సాధన చేసేవారే కీర్తి శిఖరాలపై ఉంటారు.

నాకింకా గుర్తే. శ్రీనివాస్ 15వ ఏట, విజయవాడ రేడియో కేంద్రంలో ఇంటర్వ్యూ చేశాను. తన సంగీత కచేరీ అనుభవాలెన్నో చెప్పాడు. పక్కనే తండ్రి సత్యనారాయణ కూడా ఉన్నారు.

( 5వ పేజీలో)

సుధాతరంగం-27

# నాద కోవిదులు చిన మౌలానా

- మోదుమూడి సుధాకర్

కర్ణాటక సంగీతంలోని గమకాలను, యథాతథంగా పలికించగల వాద్యాల్లో అగ్రతాంబూలం నాదస్వరానిదే! ... పురాతనమైన ఆ వాద్యం ఎంతో మంగళప్రదమైనది కూడా! అందుకే శుభకార్యాలలో ఆ వాద్య శ్రవణం చేయడం అనాదిగా ఆచారంగా వస్తోంది.

మన తెలుగునాట, ఆ వాద్యంలో నిష్ణాతులైన విద్వాంసులు అరుదనే చెప్పాలి. తమిళనాట, ప్రసిద్ధ ఆలయాలు అధికంగా ఉండటం, నిత్యం ఆ ఆలయాలలో జరిగే సేవలలో విధిగా నాదస్వర వాద్యాన్ని వినియోగించడంచేత, ఎక్కువమంది నాదస్వర కళాకారులు అక్కడ ఆదరించబడ్డారు. ఎక్కడ ఆదరణ ఉంటుందో, అక్కడ ఆ విద్య పరిఢవిల్లుతుంది.

మన రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా కరవది గ్రామం, నాదస్వర కళాకారులకు పుట్టినిల్లు. అక్కడ, వేణుగోపాలస్వామి ఆలయంలో మూడు వందల ఏళ్ళకు పైగా నాదస్వర ఆస్థాన విద్వాంసులుగా ఉన్న వంశంలో, 1924లో జన్మించారు షేక్ చినమౌలానా గారు. వీరి వంశానికి మూల పురుషు లైన విద్వాన్ ఆదంసాహెబ్, దేవగాంధారి రాగం వాయించడంలో గణుతికెక్కినవారు. విశేషమేమంటే, వీరి వంశంలో నాదస్వర విద్వాంసులే కాక, అమరకోశం, వాల్మీకి రామాయణం వంటి గ్రంథాలను అవపోసన పట్టిన సంస్కృత పండితులూ ఉన్నారు!

పసితనంలో పాలపీక బదులు సన్నాయిపీకతో

---

**(సంగీతంఎందుకు రాదు?)**

ఓ సారి బిందుమాలిని రాగం వినిపించమన్నారుట ప్రేక్షకులు. ఆ రాగంతో పరిచయం లేదు, శ్రీనివాస్‌కు.

కచేరీ ముగించుకుని... తనకు బాగా పరిచయం కలిగిన ఓ విద్వాంసుడింటికి వెళ్ళి 'బిందుమాలిని' రాగ స్వరూప స్వభావాలన్నీ, పాడించుకుని విన్నాడు. రాత్రికి రాత్రే బాగా సాధన చేశాడు. స్వాధీనమై పోయిందా రాగం. అంతే. ఆశ్చర్యం!!

మరుసటిరోజు కచేరీలో, శ్రోతలు అడక్కుండానే 'బిందుమాలిని' రాగం సర్వాంగ సుందరంగా వాయించేశాడు. 'ఎంత ముద్దో, ఎంత సొగసో' అనే త్యాగరాజు కీర్తన ఒక్కటే ఈ రాగంలో చాలా ప్రసిద్ధమైనది. అంత ముద్దుగా, సొగసుగా వినిపించాడు.

'బిందుమాలిని' రాగంలో గంటసేపు రాగం, తానం. పల్లవి వాయించి, వేలాది శ్రోతల కరతాళ ధ్వనులందుకున్నాడు. లక్ష్యశుద్ధి ఉంటే లక్ష్యం సిద్ధిస్తుంది. పట్టుదల, విశ్వాసం, భక్తి గౌరవాలు పుష్కలంగా నిండుగా కలిగిన మేధావి శ్రీనివాస్. ఒకప్పుడు సంగీతం గగన కుసుమం - ఈ వేళ ప్రసార మాధ్యమాలతో పాటు సాంకేతిక విజ్ఞానం పెరిగింది. సంగీతం, అందరికీ చేరువై పోయింది.

అర్హులైన వారికి అవకాశాలు దొరుకుతున్నాయి. ప్రతిభావంతులకు గుర్తింపు లభిస్తోంది. సంగీతాభ్యాసానికి సదుపాయాలు దండిగా ఉన్నాయి.

మనకు విద్వాంసులకు లోటు లేదు. ప్రతిభ కలిగిన వారూ లేకపోలేదు. చిత్తశుద్ధిగా నేర్పాలనే ధృఢ సంకల్పం వున్న సంగీత సద్గురువులకు దీక్షతో, నిజాయితీతో, గురువు పట్ల, సంగీతం పట్ల, భక్తి గౌరవాలు కల్గిన శిష్యులు దొరికితే 'సంగీతం' ఎందుకు రాదు?

పెరిగారేమో... చినమౌలానా గారు, తన తొమ్మిదవ ఏటనే కరవది ఆలయంలో తొలి నాదస్వర కచేరి చేశారు!ఆయనపేరుతెలుగునాట మారుమోగిపోయింది.

పుట్టింది ముస్లిం కుటుంబంలో అయినా, వారి ఇల్లు వైదిక సాంప్రదాయాలకు నిలయంగా దర్శనమిచ్చేది! పట్టు బట్టలు కట్టుకొని, కుంకుమబొట్టు పెట్టుకొని, పెరుమాళ్ళను అర్చించే, చినమౌలానా గారు నిత్య నాదోపాసకునిగా దర్శనమిచ్చేవారు!

ఎన్నో తీర్థక్షేత్రాలు దర్శించి, అక్కడి దేవతామూర్తుల్ని తన నాదస్వరగంగతో అభిషేకించి, అక్కడి స్థానికులచే 'తమ ప్రాంతంలోనే నివాసం ఉండమని' అభ్యర్థన లందు కొన్న భాగ్యశాలి ఆయన! నాదస్వరంలో మేరుపర్వతం వంటి రాజరత్నం పిళ్ళెగారి శైలిని అమితంగా ఇష్టపడేచినమౌలానా, ఆయననే తన మానసిక గురువుగా ఆరాధించి, ఆ బాణీని స్వంతం చేసుకున్నారు.

తమిళనాట, కావేరీ తీరాన, శ్రీరంగంలో కొలువైన రంగనాథస్వామి సన్నిధిని తన స్థిరనివాసం చేసుకొన్నారాయన. దక్షిణాదిన, ఆయన నాదస్వరం ప్రతిధ్వనించని దేవాలయం లేదు. ఆయన అందుకోని సత్కారం లేదు. భారత ప్రభుత్వంచే 'పద్మశ్రీ', కేంద్ర సంగీత, నాటక అకాడమీ పురస్కారాలు, తమిళనాడు ప్రభుత్వం నుండి 'కలైమామణి', ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడమీ వారి 'గానకళా ప్రపూర్ణ' బిరుదు, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు అందులోని కొన్ని. 1973లో ఢిల్లీలోని ఎర్రకోట వద్ద భారత స్వాతంత్ర్య రజతోత్సవాలలో కేంద్రప్రభుత్వం ఆహ్వానంపై కచేరీ చేశారాయన! విదేశాలెన్నో పర్యటించి, తన సంగీతంతో విశ్వమానవుల నీరాజనాలందు కున్నారు! అమెరికాలో 'నాదస్వర ఆచార్య' అను బిరుదుతో సత్కారం పొందారు! అసంఖ్యాకంగా వారి నాదస్వర ఆడియో రికార్డులు విడుదలయ్యాయి.

చినమౌలానా గారి నాదస్వర కచేరీని 1980వ సంవత్సరం, మచిలీపట్నం సరస్వతి కళాసమితిలో మొట్టమొదటిసారిగా నేను వినడం జరిగింది. సుమారు మూడున్నర గంటలపాటు సాగిన ఆనాటి కచేరీ, శ్రోతలపై పన్నీటి జల్లులు కురిపించింది. 'వాతాపి గణపతిం భజే' కృతిలో ఆయన ఎంత సుదీర్ఘంగా స్వర ప్రస్థారం చేశారో, శ్రోతలూ అంతే సుదీర్ఘంగా హర్షధ్వానాలిచ్చారు.

విశేషమేమంటే... కచేరికి వెళ్ళేముందు, ఆయన వెంట ఒక శిష్యుడు, శ్రుతిపెట్టెను మెడలో ధరించి శ్రుతిని నిరంతరాయంగా వినిపిస్తూంటే, ఆయన అది వింటూ, తన పనులన్నీ పూర్తి చేసుకుని, కచేరీకి సిద్ధమయ్యారు.

చినమౌలానా గారు, పెద్దలయెడ అపారగౌరవం కలవారు. తెలుగునాట లబ్ధప్రతిష్ఠులైన నాదస్వర విద్వాంసులు దాలిపర్తి పిచ్చి హరిగారు (పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి ప్రియ శిష్యులు) నివసించిన ఇల్లు ఎక్కడో వాకబు చేసి, మచిలీపట్నంలోని ఆ ఇంటికి తన బృందంతో వెళ్ళి, ముమ్మార్లు ప్రదక్షిణం చేసి, వారి స్మృతికి నమస్కరించి, అక్కడి ధూళిని నుదుట భూతిగా రాసుకున్న వినయశీలి.

శ్రీరంగంలో 'శారదా నాదస్వర' వారి ఆధ్వర్యంలోను తిరుపతి ఎస్వీ సంగీత కళాశాలలో తప్ప ఎక్కువగా నాదస్వర, డోలు వాద్యాలలో శిక్షణ జరగటంలేదు.

ఇప్పటికైనా, ప్రభుత్వాలు చొరవ తీసుకుని, సంగీత కళాశాలలో నాదస్వరం, డోలు, వేణువు, క్లారినెట్ మొదలైన వాద్యాలలో శిక్షణ తరగతులు ప్రారంభిస్తే, ఆ విద్య పదికాలాలపాటు నిలుస్తుంది. ఎంతోమందికి విద్యార్థులకు, గురువులకు భుక్తి కల్గుతుంది.

# *Brief Pen Picture of*
# *Shri NallanChakravartula Krishnamacharyulu*

One of the greatest doyens of Karnatic Classical music, Sri NallanChakravartula Krishnamacharyulu was a scholar par excellence who left his imprint to remain forever.

Shri Krishnamacharyulu, was a multi-faceted exponent in music, musicology, languages etc. Born in Andhra Pradesh in the year 1924, he had his earlier education under the tutelage of Sri ChilakamarriKesavacharyulu and advanced training under Sri ParupalliRamakrishnaiahPantulugaru.

He initially worked in All India Radio and had a successful career at AIR, Vijayawada station. His entry into the space of compositions has been quite surprising. He never had any thoughts of penning compositions. Therefore, writing "GeyaKrithis", essentially to fill the gapsin existing literature, was nowhere on the horizon. It all happened so dramatic that he took to write at the insistence of those whom he revered a lot. But it was Shri Sandhyavandanam Srinivas Rao, in 1952 drew the attention of AIR NilayaVidwans to attempt writing Krithis on the lines of Carnatic Music Trinity. The inspiration and belief given byShri Srinivasa Rao, pushed Shri Krishnamacharyulu to write his first Krithi praising Thyagaraja Swamy, in Raaga Keeravani(*'ParamardhamideTeliyare'* in *Adi Tala*).In this scholarly composition he followed the footsteps ofShyama Sastry's compositions (*'Ratnatrayam'*) *Todi, Bhairavi, Yadukulakambhojiswarajatis*, the *charanas* starts on the *swaras* in the *Arohanakrama*or the ascending structure and he beautifully explained the extraordinary qualities and temperament of the Saint Composer Tyagaraja in the*Krithi*. This was his first attempt towards writing compositions and it received rave reviews.

With further support and encouragement received from Shri BalantrapuRajanikatharao, Shri Krishnamacharyulu worked on to complete *'SataKeerthanaMaala'*. Having understood the subliminal sweetness of *Krithis* of *Vaaggeyakaaraas*, he carried out a great job in imbuing the subtleties of a scholarly composition.

He went on to write several *Krithis* as the insistence of stalwarts. To name a few, a *Krithi* in *'Naataka Priya Raaga'*(*'MaarajananeemAasraye'* set to *Adi Tala*), famous among musical geniuses and scholarsat the request of Shri VoletiVenkateswarlu, a *Krithi* in typical Shyama Shastri style in *'TodiRaaga'*(*'SyamakrishnamUpasmahe'* set to *Khanda Triputa Tala*) and another in *'Ananda Bhairavi'*(*'Syamasatryvarya'* set to *Rupaka Tala*)in praise of one of the music trinities Sri Shyama Shastry, at the request of Shri NaarumanchiSubba Rao, a *krithi* in Sanskrit in praise of Sri Kanaka Durga Devi (*Kshetram* located in Vijayawada) in *'Kalyani Raga'*(*'SrikanakaDurge'* set to *Adi Tala*)at the request of Shri B.V. Raman and Shri B.V. Lakshman.

Apart from obliging the requests of elders, he made efforts to write few more *Krithis*, but he never cared to record, preserve and protect his own writings. He wrote many light music songs, during his tenure with AIR, which have never seen light of the day. He also wrote many *Harikathas* which remained as rough drafts.

He has rather not given importance in retaining copies of important works he completed. As an example, he never retained copy of the entire material including the rough draft of '*VipraNaarayana'*, *Kuchipudi Yakshagana* Ballet, written at the request of Shri Vedantam Satyanarayana Sarma. He wrote few volumes of poetry in Sanskrit, some got published, some were not available. Somehow, he managed to retain fifteen *Harikathas* that were written in Sanskrit on Ramayana and other *Kaavyas* as desired by '*KapileswarapuramAdhipati'*, Zamindar Shri S.B.P.B.K. Satyanarayana Rao. His play *'MruthaSanjeevanam'* written in Sanskrit was published. Shriman K.T.L. Narasimhacharyulu of *Godaa Grandhamaala*, included some of the *Kaavyaas* of Shri Krishnamacharyulu in Telugu. The total number of songs in both Sanskrit and Telugu *Harikathas* may exceed 500 in number.

One more important literary work of Shri Krishnamacharyulu, was '*MukundamaalaGeyams'* in Telugu, played in four parts in *Bhakti Ranjani* Programme from Vijayawada AIR Station, which received wide appreciation.

Finally, his sons jumped the bar and gathered quite a few of his works and made efforts to publish them on the occasion of his 70th Birthday Celebration. While they were not even 20 in number, his second son, N.Ch. Buchayyaacharyulu preserved some and some were carefully curated by his cousin N.C.V. Jagannadhaacharyulu. Finally, his younger brother, somehow captured the lyrics of some of his *Krithis* in *'Kedara'* and *'Shanmukha Priya Raagas'*, and published them in the Srinivas Iyengar Felicitation issue.

In fact, he had to make efforts to gather his own *Thillana* structured in *Athana Raga*, from the family of Shri Challa Narasimha Murthy. It was very close to his heart as he wrote this *Thillana* at their insistence while he was teaching their children. These *Thillanas* were critically acclaimed, including appreciation of Shri M.S. Gopalakrishnan and Shri T.R. Subrahmanyam, while Shri T.M. Thyagarajan and Shri Lalgudi Jayaraman appreciated his *Krithi* in Naataka Priya Raaga, which he wrote for Shri VoletiVenkateswarlu.

He never tried to formulate his own *ShataKeerthanaMaala*. Two pieces of work, which he wrote with intent and purpose were the translation of Saint Thyagaraja's '*NaukaaCharitam'* and a Sanskrit play '*MruthaSanjeevanam'*. As advised by Dr. Raghavan, Delhi Sanskrit Academy published '*NaukaaCharitam'* in their half-yearly magazine '*Sanskrita Pratibha'* in 1970. *'NaukaaCharitam'* was written in shloka format and Shri VoletiVenkateswarlu got it conducted in AIR through its *Nilayavidwans*.

He always held that it was the blessings of Trinity which made him contribute, but never took credit to his merit on any account. He always traced his strength in *Harikatha* writing and vocabulary to his father Shri T.N.C.S.J. Thiruvenkatacharyulu. He also wrote *'GarbhaKrithis'*, a category of musical work that essentially contains a couple of more *Krithis* entwined into the main *Krithi*, with *taalabhedam*. He wrote three such *'GarbhaKrithis'*. Originally the *Kriti* is set to be sung in *Adi Tala* and when it is to be sung in *Rupaka Tala*, one has to limit the first eight *matras* of *Sahitya* in *Pallavi*, *Anupallavi* and *Madhyamakala Sahitya*. Similarly, while singing the *charanam* in *RupakaTala*, one has to omit the last eight *matras* of *Sahitya*. This literary experiment was also exemplified in *'Appakaveeyam'*. He also made an attempt to include in the *GeyaKavithwam* format, which in itself a complex structure to be thought of. He wrote it in a simple way to allow any *rasika* to capture and sing, while leaving enough scope of *manodhaarmikas* to adopt.

Once he gladly confessed that leaned more towards Sanskrit in writing his *Krithis*. He taught a very few of his *Krithis*to a few students, who persisted upon. Usually, a *Vidwan* keeps interest in fame, but Shri Krishnamacharyulu had shown great reluctance to gain fame. He found great solace when his *Krithis* were published by Shri ParamahansaParivrajakaacharyulu Shri ShriShriTridandiShrimannaaraayana (China) Jeer Swamy varu, with his auspicious blessing in their Ramanuja Vani Press.

SrimanN.Ch.Krishnamacharyulu was the recipient of several titles including the *'GaanakalaaPrapurna'* from Andhra Pradesh Sangeeta Academy. He was presented*'VisishtaVyakti'* award byAll India Radio duringits Golden Jubilee celebrations. He was also the recipient of*'Vaggeyakara'* Award from the MadrasMusic Academy, in 2005.

Shri Krishnamacharyulu made his contribution in the form of several scholarly rich *Varnams*, *Kritis* and *Thillanas*that acquired a special place in the field ofKarnatic Classical music. He also wrote many books in Telugu and Sanskrit, including *'TyagarajaCharitram'*, *'TyagarajaAshtottaram'*, *'Sampradaya VaangmayaSourabham'* and a book with the compilation of his own *Krithis'Krishnamacharya Sangeeta Krutulu'* among others.

He took great pains to imbibe his great qualities in his teachings and now his disciples have turnedinto highly acclaimed *vidwans*. Well-Known Violin maestro and musicologist Sri N.Ch.Krishnamacharyulu, a significant contributor to the Karnatic Classical Music space, passed away in Vijayawada on 24th August, 2007 leaving his Legacy to be continued by his disciples.

**- Venkata Nagalakshmi Manda,**

Research Scholor, Department of Music and Fine arts,

University of Delhi,

New Delhi.

# సంగీతం మన ఆరోగ్యం

- యస్. సల్మా

మానవ శరీరం భూమి, గాని, నీరు, అగ్ని, ఆకాశం వంటి పంచ భూతాలతో విలీనం అయివుంటుంది. ఇంకను షట్చక్రాలు అనబడు మూలాధార, స్వాధిష్టాన, మణిపుర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞ, సహస్రార అను చక్రాలతో నిండి వుంటుంది.

భూమి చుట్టూ కాస్మిక్ అను వలయం వుంటుంది. దీనినే కాస్మిక్ శక్తి అందురు. యోగ, ధ్యానంలో సాధన చేసిన వారికి కాస్మిక్ శక్తి శరీరంలో ప్రవాహం జరిగి షట్చక్రాలుత్తేజితం చెంది శరీరం ఆరోగ్యంగా ఉంచడం లోనూ, మనస్సును, బుద్ధిని క్రమబద్ధీకరించడంలో ఉపయోగపడుతుంది. ఇంకనూ ప్రార్థనా స్థలాలు గోపురపు ఆకారము మరియు త్రిభుజాకారంలో వుండడం కారణంగా అటువంటి చోట్ల మనస్సుకు ప్రశాంతత కలుగుతుంది. కారణం అక్కడ విరివిగా కాస్మిక్ ఎనర్జీ ప్రవాహం ఉండడం. సంగీతం ద్వారా కూడా కాస్మిక్ ఎనర్జీ మన శరీరంలో ప్రవహించేలా చేయవచ్చు. భారతీయ సంగీతం కూడా షట్చక్రాలపై ఎంతగానో ప్రభావం చూపిస్తుంది. సామ వేదము నుండి సంగీతం వచ్చింది. నిటారుగా కూర్చోని సంగీతాన్ని ఏకాగ్రతతో సాధన చేయడం వలన సప్తస్వరాలు అయిన స, రి, గ, మ, ప, ద, ని, లు ఒక్కొక్కటి ఒక్కొక్క చక్రం నందు పలుకుతాయి. అనగా స మూలాధార, రి స్వాధిష్టాన, గ మణిపూర, మ అనాహత, ప విశుద్ధ, ద ఆజ్ఞ, ని సహస్రార మందు నిలిచి ఉంటాయి. ఇందులో గల తేడాను సాధనలో మనం గమనించవచ్చు. షట్చక్రాలు ఉత్తేజితమైనప్పుడు కుండలినీ శక్తి ఉత్తేజితం చెంది సహస్రారం చేరి మనోనేత్రం తెరవబడుతుంది. కఠినమైన సాధన చేసినవారికి మాత్రమే ఇది సాధ్యం అవుతుంది.

సంగీత ప్రపంచంలో త్రిమూర్తులు అయిన శ్రీ ముత్తుస్వామి దీక్షితులు, శ్రీ త్యాగరాజ స్వామి, శ్రీ శ్యామశాస్త్రులు వారు ఇంకనూ అన్నమయ్య వంటి ఎందరో గొప్ప వాగ్గేయకారులు నాదోపాసన ద్వారా మనోనేత్రం తెరవబడి నాద జ్యోతి వెలుగులో వారి ఆరాధ్య దైవములను దర్శించుకోగలిగారు.

నాదోపాసన చేయడం వలన షట్చక్రాల పని తీరు మెరుగుపడి శరీరంలో బలహీన ఆలోచనలు బయటకు తరిమివేయబడి ఆరోగ్యకరమైన శరీరాన్ని, బుద్ధిని, మనస్సును పొందుతారు. ఇటువంటి స్థితిలో మనోనేత్రం తెరవబడి మంచి చెడులు గోచరిస్తాయి.

నేటి సమాజానికి, ప్రపంచానికి సంగీతం యొక్క అవసరం ఎంతగానో ఉంది. సంగీత స్వరాలు పాడుతున్న సమయంలో స్వరాల నుండి వచ్చు ప్రకంపనల కారణంగా షట్చక్రాలు ఉత్తేజితమయ్యి ఎనర్జీగా మారుతుంది. తద్వారా ఎన్నో మానసిక వ్యాధుల నుండి బయట పడవచ్చును.

సంగీతం ద్వారా ఆరోగ్యం భౌతికంగా, మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా జీవించడానికి ఉపయోగపడుతుంది. SAADANA OF RAGA REACH HIGH LEVEL OF CONSCIOUSNESS నిత్యజీవితంలో మనలో కలుగు రకరకాల భావోద్వేగాలను కట్టడి చేయడానికి సంగీతం ఒక ఆయుధం.

**మనస్సుపై సంగీతం ఎలా ప్రభావితం చూపిస్తుంది?**

మానవ శరీరంలో 72 వేల నాడులు వున్నట్లే కర్ణాటక సంగీతంలో 72 మేళకర్త రాగాలు కలవు. ఈ రాగాలు మానవుని శరీరంలో నాడీవ్యవస్థ పై ఎంతో ప్రభావం చూపిస్తున్నాయి.

ఉత్సాహంగా వుండే రాగాలను విన్నప్పుడు శరీరంలో ఆనందానికి సంబంధించిన రసాయనాలు విడుదల అయి మనస్సును, శరీరమును ఉత్సాహంగా ఉంచడంలో ఉపయోగపడుతుంది. ఇదే విధంగా గంభీరంగా ఉండే రాగాలు, భక్తిరస ప్రధాన రాగాలు, కరుణరస ప్రధాన రాగాలు విన్నప్పుడు వాటికి సంబంధించిన రసాయనాలు విడుదల అవుతాయి. ఇక్కడ రసము అనగా మనసు నందు ఏర్పడు ఒక మార్పు, మనసులో కలుగు ఒక భావన, మనసులో కలిగే అనుభూతిని రసము అందురు. భరతుడు తన నాట్యశాస్త్ర గ్రంథంలో చెప్పినట్లు రసభావన అనునది రాగం యొక్క స్వరములపై ఆధారపడియున్నది. సంగీతం నందు మనస్సును ఆహ్లాదపరచునట్టి గానరస రాగములు కూడా కలవు.

ఈ ఆధునిక యుగంలో, హడావుడి జీవితంలో మానవుడు కావాలను కోరుకోకున్ననూ పొందుతున్న మానసిక గ్లాని నుండి ఎటువంటి హాని పొందకుండా విముక్తుడు కావడానికి మన భారతీయ సాంప్రదాయ సంగీతం ఒక చక్కని మందు. ప్రశాంతమైన మనస్సును పొంది గందరగోళపరిచే ఆందోళనల నుండి ఈ సంగీతాన్ని అభ్యసించడం ద్వారా, ప్రశాంతంగా వినడం ద్వారా గణనీయమైన ప్రయోజనాన్ని పొందగలుగుతాము.

## శ్రీరామసమాజం, కాకినాడ

వారి సమాజ భవనంలో ది.2.1.2022 ఆదివారం సాయంత్రం 6 గంIIలకు జయంతి సోదరీమణుల (అమెరికా) ప్రత్యేక సంగీత సభా కార్యక్రమం శ్రోతలను విశేషంగా అలరించింది.

అమెరికా వాసులయినప్పటికి సంగీతం మీద ఉన్న అభిమానంతో సంగీత విద్యను నేర్చుకొని విశేష ఆదరణ పొందిన వర్ధిష్ణు కళాకారిణులు కుమారి జయంతి శృతి, కుమారి జయంతి శ్రావ్య గాత్ర సంగీతాన్ని వినిపించి శ్రోతల, విద్వాంసుల ఆశీస్సులను అందుకొన్నారు. విద్వాన్ శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి, విద్వాన్ శ్రీ వారణాసి శ్రీనివాస్ వైలెన్ మృదంగాలపై ప్రోత్సాహకర సహకారము అందించి కార్యక్రమ విజయవంతానికి దోహదపడ్డారు. కార్యక్రమంలో హమీర్ కళ్యాణిలో మానము లేదా!, శ్రీరంజనిలో భువినిదాసుడనే, పూర్వీకళ్యాణిలో ఆనంద నటనం, కీరవాణిలో కలిగియుంటే కదా!, కానడలో వాని పొందు వంటి పట్టైన అంశాలను వినిపించి అలరించారు.

శ్రీరామసమాజ అధ్యక్షులు ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు కళాకారులను ఆశీర్వదించారు. ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు శ్రీ ముళ్ళపూడి నాగేశ్వరరావు కళాకారులకు జ్ఞాపికను బహుకరించారు. సమాజ కార్యవర్గ సభ్యులు జి.ఎస్.కె.డి. వెంకట్రావు, ఎమ్.వి. కృష్ణంరాజు, ఎన్.మణిబాబు, జె.ఎస్.శాస్త్రి, శ్రీమతులు చావలి సూర్యకుమారి, ప్రభల రాజేశ్వరి, ఎమ్.వి.భరతలక్ష్మి తదితరులు ఆశీస్సులు అందచేశారు. కళాకారిణుల తల్లితండ్రులు శ్రీమతి లక్ష్మి, శ్రీ మురళి దంపతులు ఈ అవకాశం కల్పించినందుకు శ్రీరామసమాజం వారికి, కార్యక్రమ సమర్పకులు శ్రీ రాయవరపు సీతారామాంజనేయులు గారికి కృతజ్ఞతలు తెలియచేసారు. కార్యదర్శి మునుగంటి వెంకట్రావు కళాకారులను పరిచయం చేసి వందన సమర్పణ చేసారు.

# సర్వం 'నాదమయం' మా గురుకుల వాసం
# నేదునూరి కృష్ణమూర్తి గారితో మల్లాది సోదరుల అనుభవసారం.

నమస్కారమండి! 2021 అక్టోబర్ 10వ తేదీ వారి 94వ జయన్తి సందర్భంగా గురువుగారి గురించి చెబుతామనుకొన్న కొన్ని కొన్ని అంశాలు – వారి దగ్గరకు ఎప్పుడు వెళ్ళాము, ఎలా వెళ్ళాము. ఆయనతో పాటు పాడిన కచేరీల అనుభవం – అలాగే వారి సంగీతానుభవాల నుండి జీవితాను భవముల నుండి నేర్చుకొన్న అంశాలను మాకెలా చెప్పారు అనే అంశాలను క్లుప్తంగా మీ ముందు వుంచుతున్నాను.



"ఒరే ప్రసాద్ – బుజ్జి! ఇవాళ సాయంత్రం మనం నేదునూరికృష్ణమూర్తిగారని పెద్ద విద్వాంసులు వున్నారు. వారి దగ్గరకు వెళదాం! వారికి వినిపించడానికి కొంత సిద్ధం కండి. ఓసారి వచ్చినవి చూసుకోండి!" అన్నారు నాన్నగారు ఓ రోజున. అనగానే నేను తమ్ముడు అప్పటి దాకా నేర్చుకొన్న వర్ణాలు, కీర్తనలు కొన్ని సిద్ధం చేసుకొని వెళ్ళాం!

గురువు గారికి నమస్కారం పెట్టుకొన్నాం. అప్పట్లో వారు విజయవాడ దుర్గివారి వీధి, గాంధీనగరంలో వుండేవారు! "పిల్లలకి మీ దగ్గర సంగీతం నేర్పించాలనుకుంటున్నాను గురువుగారు" అని నాన్నగారు సవినయంగా ప్రార్థించారు. అప్పటికే నాన్నగారు, బాబయ్యగారు గురువు గారి దగ్గర మూడు, నాలుగు నెలలపాటు ......... పది పదిహేను పెద్ద కీర్తనలు నేర్చుకొన్నారు. వాటిని బాగా సాధన చేసి గురువుగారితో మంచి అనుబంధం ఏర్పడిన తర్వాత ఆ ధైర్యంతో మమ్మల్ని గురువుగారి దగ్గరకు తీసుకు వెళ్ళారు. ఆ కీర్తనలు

తనయుని త్రోవ; ఇకనన్ను బ్రోవకొన్న– భైరవి ; శ్రీ రఘుకులనిధిం – హుసేని, ఎందుకో నీ మనసు – బిరాన వరాలిచ్చి – శ్రీ జగదంబ – జంఝూటి; మరి మరి నిన్నే – కాంభోజి

ఈ కీర్తన ఇంచుమించు ఏడెనిమిది పాఠాల్లో బాగా మథించారు. ఈ కీర్తన స్వర సంపుటీకరణ వారే చేశారు. అదెలా అంటే 'సీతారాజన్ గారు పాడిన ఈ కీర్తన విన్నాక ఆ నొటేషన్ సిద్ధం చేశారుట – ఆయనే చెప్పారు.

"ఏరా ! నీ పేరేమిటి? శ్రీరామ్ ప్రసాద్ అండి! నీ పేరు! .......

వారికి అలా ఆప్యాయముగా పిల్లల్ని "ఏరా!" అని పిలవడం యిష్టం. అలా అందంగా ఏవర్రా! తంబురా శృతితో పాడడం వచ్చా!! తంబురా శృతి చేయడం వచ్చా! నొటేషన్ వ్రాయడం వచ్చా!

"వచ్చండి" గురువుగారు – మా సమాధానం.

'సరే! తోడి వర్ణం పాడండి! అన్నారు. 'ఏరా! నాపై యింత చౌకసేయ! అప్పటికి నేర్చుకొన్న వర్ణం గమక పుష్టితో పాడాం! ఆ తరువాత కొన్ని పాఠాలే జరిగాయి. ఇంతలో విశాఖ ఆంధ్రాయూనివర్శిటిలో శ్రీ ఎల్.ఎస్.ఆర్ కృష్ణ శాస్త్రి గారు సంగీత విభాగం ఏర్పాటు చేస్తూనే నేదునూరి కృష్ణమూర్తి గారిని విజిటింగ్ ప్రొఫెసర్ గా రమ్మన్నారు. నిజానికి, మొదట కాకినాడలో గాని, చెన్నైలో గాని, విశాఖలోగాని మకాం ఏర్పాటు చేసుకోవాలని అనుకొంటున్న తరుణంలో ఈ అవకాశంతో 'సంగీత సాగరులు' సాగరతీరమైన విశాఖకు మకాం మార్చారు. విజయవాడలో మా పాఠం ఆగిపోయింది.

కొన్నాళ్ళకు నాన్నగారికి ఉత్తరం వ్రాశారు. "పిల్లలు బాగా పాడుతున్నారు. వాళ్ళకి చెప్పాలని వుంది. గురుకుల వాసం చేసేటట్లయితే నాదగ్గరకు పంపండి, నా దగ్గరే వుంటారు. వారికి స్కాలర్ షిప్ ఇచ్చే అవకాశం కూడా వుంటుందన్నారు." ఇదొక మహదవకాశంగా వెంటనే నేను విశాఖ గురువు గారి దగ్గరకు చేరిపోయాను. కొద్దికాలం తరువాత నా సోదరుడు చేరాడు. ఇలా 1991లో ప్రారంభమైన మా సంగీత శిక్షణా ప్రస్థానం 2014లో గురువు గారి 'దేహయాత్ర' జరిగిన వరకు సుదీర్ఘంగా సాగింది. ఇది మొదటి అంకం.

శివానుగ్రహంతో – భగవదనుగ్రహంతో గురువు దొరుకుతారు. అదే గురువు అనుగ్రహంతో పరమాత్ముడు దొరుకుతాడు" ఇది శివానంద మూర్తిగారు అన్న అమృత వాక్యం.

పరమేశ్వరానుగ్రహంతో లభించిన గురువుల వల్ల నాదతనువుడైన ఆ భగవదనుగ్రం పొందే అవకాశం పొందగలిగాము.

ఇలా వుండగా డా॥ పొదిలి బ్రహ్మయ్యశాస్త్రి గారితో మాటల సందర్భంగా శ్రీపాద పినాకపాణి గారి గురించి మాతో చెప్పి వారి కీర్తనల కేసెట్లు ఆరు దాకా ఇచ్చి "వీటిని వినండి! పాఠం చేయండి! వారి దగ్గర నేర్చుకొనే యోగ్యత, అర్హత కలుగుతుంద"న్నారు.

పురాణాల్లో నారదుడు ధ్రువునికి, ప్రహ్లాదునికి ఉపదేశం చేసినట్లుగా మాకు పొదిలివారు ఉపదేశం చేసారు.

మద్రాసు 'ఇండియన్ ఫైన్ ఆర్ట్స్' లో శ్రీపాద పినాకపాణి గారి కచేరీకి వెళ్ళాము. అది డిశంబరు సీజన్. 1991 – 92 సంవత్సరాలలో సంగతి. మేము మా గురువుగారు నేదునూరి వారు, గొల్లపూడి మారుతీరావు గారు వెళ్ళాము. ఇంకా శ్రోతలలో మహావిద్వాంసుడు మాండలిన్ శ్రీనివాస్ మొదలైన వారుండగా, వయోలిన్‌పై ఎమ్.శ్రీ చంద్రశేఖరన్ గారు, మృదంగంపై రమేష్ సహకారం అందించారు.

కచేరీ అయ్యాక 'గురువుగారూ! మీ దగ్గర, సంగీతం నేర్చుకోవాలని అనుకొంటున్నాము అండి! మేం మల్లాది సూరిబాబుగారి పిల్లలమండి!' అంటూ అప్రయ్నంగా చేసిన అభ్యర్ధన.

అలా అనగానే తప్పకుండానయ్యా! నేనూ పెద్దవాడిని అయిపోతున్నాను. ఇప్పుడు నా వయస్సు 79 సంవత్సరాలు అన్నారు. అలా గురువుగారి గురువుగారి దగ్గర సంగీతాభ్యాసం చేసే అవకాశం కల్గింది. వారు దేహత్యాగం చేసిన 2013 దాకా సుమారు 50 సార్లు కర్నూలు వెళ్ళి వారి దగ్గర సంగీత శిక్షణాభ్యాసం చేసాము. ఇలా రెండు పునీతమైన నదులలో ఒకేసారి స్నానం చేసే అవకాశం కలగడం పురాకృత పుణ్య విశేషమే!

మా అభిమానులలో ఒకాయన 'ఏమయ్యా! మీ గురువులు పంచనదక్షేత్రం వంటి వారు. అయిదు నదులు ప్రవహించేది కనుక తిరువయ్యారు అయింది. మీరు అయిదు నదులలో స్నానం చేస్తున్నారు.

మొదటి నది మీ తాతగారు మల్లాది శ్రీరామమూర్తిగారు.

రెండవనది మీ నాన్నగారు మల్లాది సూరిబాబుగారు

మూడవనది శ్రీ ఓలేటి వెంకటేశ్వర్లు గారు – మీనాన్నగారి గురువుగారు.

నాల్గవ నది శ్రీ నేదునూరి కృష్ణమూర్తిగారనే ప్రవాహం.

ఐదవనది శ్రీ శ్రీపాద పినాకపాణి మహోదయులు. చాలా గొప్ప భావం! జన్మ ధన్యమైంది! మనసంతా పొంగిపోయింది.

శ్రీ నేదునూరి వారు విశాఖలో వాకింగ్ చేస్తున్న సమయంలో కూడా ఎన్నో విషయాలు మాకు లభించాయి.మొదటి సంవత్స రంలో, ఎన్నో అపురూపమైన, ప్రసిద్ధమైన కీర్తనలు ప్రారంభం చేసారు. చక్కని తంబుర శ్రుతితో వారి పాఠంతో పాటు వారి అనుష్ఠాన విధానం, సంధ్యావందనాది క్రియలూ, భక్తి శ్రద్ధలూ మరింత అలవడ్డాయి.

అలా ఎన్నో కీర్తనలు – పరదేవతా; చని తోడితేవే; లంబోదరమవలంబే; చేసిన వెల్ల మరచితివో! వంటి రెండొందల పైన కీర్తనలు గురుకుల వాస పద్దతిలో ఒంట పట్టించుకొన్నాము.

**గురువుగారు నెరవల్ పాడేటప్పుడు ఎలాంటి పద్ధతులు పాటించేవారు, సూచనలు చెప్పేవారు వంటి అంశాలు మీకోసం ముచ్చటిస్తాను.**

పెద్ద విద్వాంసులందరూ దీనికి సంబంధించిన శాస్త్ర విషయాలు చెప్తారు.

కాని, గురువుగారు...

నెరవల్‌లో అనేక అంశాలు చోటు చేసుకుంటాయి అంటూ, విస్తారంగా పాడి, మా చేత కూడా పాడిస్తూ ఉండేవారు. ఈ విషయంలో నేను పాడిన నెరవల్ మాత్రమే వినండి, నా నెరవల్ పద్ధతే అనుసరించండి! అనకుండా పెద్దలందరి పద్ధతులూ వినమనేవారు. "ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మిగారు నెరవల్ చాలా బాగా పాడతారు. అలాగే కె.వి. నారాయణస్వామిగారు కూడా..." అంటూ పెద్ద విద్వాంసుల, సమకాలీన విద్వాంసుల నెరవల్ పాడే విధానాన్ని గమనిస్తూ, చాలా గ్రహించాలి అని బోధ చేసేవారు. ఏ విద్య అయినా నాలుగు రకాలుగా ఒంటపడుతుంది అని చెప్పే శ్లోకం **'ఆచార్యాత్ పాదమాదత్తే / పాదం శిష్యః స్వమేధయా / పాదం సబ్రహ్మచారిభ్యః / పాదం కాలక్రమేణచ౹౹'** గుర్తుకొస్తుంది. మా తాతగారు మల్లాది శ్రీరామమూర్తి గారు ఇలాంటివన్నీ ఒక ప్రత్యేకమైన డైరీలో వ్రాయించేవారు. అనుభవంతో కూడా ఈ మనోధర్మ ప్రక్రియలని మనం నేర్పుగా ప్రదర్శించవచ్చని వారి గురువులు ముఖ్యంగా పాణిగారు నేర్పిన విధానం బాగా గ్రహించి మాకు తెలిపారు. పెద్ద గురువుగారి సంగీత శైలిని, చాలా మటుకు నేదునూరి

వారు తీసుకొని కచేరికి సంబంధించిన అంశాలలో కొంత స్వతంత్రత తీసుకుని ప్రదర్శన చేసేవారు. కచేరీ పోకడలను గ్రహిస్తూ రక్తికి ప్రాధాన్యం కల్పిస్తూ.

కేవలం సంగతులతోనే సంచరిస్తూ వుంటే అది సంగీతం కాదు! సౌఖ్యభావం కూడా రావాలి అని చెప్తూ, కచేరీ పద్ధతిలో ఎలా పాడాలో విశదంగా చెప్తూ ఉండేవారు. పెద్ద పెద్ద విద్వాంసులందరూ గురువుగారికి సహకారం అందించేవారు కాబట్టి, వారి అనుభవాలన్నీ కూడా గురువుగారి కచేరీలపై ప్రభావం చూపించాయి కాబట్టి ఆయన సంగీత పంథాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా తమిళశ్రోతలు విమర్శనాత్మకంగా కచేరీలను వినే అలవాటు గలవారు కాబట్టి, అనుభవజ్ఞులైన గాయకుల నుండి అది కావాలి, ఇది కావాలి అని విశ్లేషణాత్మకంగా కోరే అలవాటు వుండడాన్ని గురువుగారు దృష్టిలో పెట్టుకునేవారు. వారు పాడుతున్న అంశాలన్నింటినీ మమ్మల్ని గమనిస్తూ వుండమని ప్రత్యేకంగా చెప్పేవారు.

**గురువుగారి స్వరకల్పన విశేషాల గురించి మేము గమనించిన విశేషాలు :**స్వరకల్పన ప్రదర్శించడమంటే రాగాభావాన్ని మరింత విస్తృతంగా సమర్పించడమే అని గురువుగారు విశ్వసిస్తారు. అలాగే, తగు మాత్రమైన లెక్కాచారము. 'ఈత నేర్చివుండు కానీ, లోతు ఈత ఈద రాదు, లెక్క తెలుసుకోవాలి, సైన్సు వుండాలి కానీ, అది  రాగసౌందర్యాన్ని మింగరాదు. రాగం యొక్క ఆత్మని స్వరకల్పనలో ఆవిష్కరించే ప్రయత్నమే చెయ్యాలి'.

స్వరకల్పన ప్రదర్శనలో ముఖ్యంగా 'భవనుత', 'రామానీపై', 'హంసధ్వని' అంశాలలో కచేరీ ప్రారంభంలో గొంతు స్వాధీనంలో రావడానికి వారు చేసే స్వరకల్పనలు స్వీయానుభవం నుంచి సహజాతాలుగా ప్రదర్శనలోకి రావడం సంగీత ప్రియులందరికీ అనుభవైక వేద్యమే! స్వరకల్పనలను దర్శించి ఒక చక్కని సంపుటీకరణతో రూపొందించుకుని ప్రదర్శనచేసే సమయంలో మరింత అంద చందాలతో సెకనులో దానిని మార్పు చేసే విద్య ఆయన సొంతం. ఒక ఆవృతంలో ఒక అందమైన ఫ్రేమును రూపొందించుకుంటారు. ఒక అర ఆవృతం ఒక లఘువు వెళ్తుంటే, ధృతంలో  ఏమి రావాలన్నది కంప్యూటర్ బ్రెయిన్ లా సెకన్లలో ఒక అందమైన ఫేజ్ వచ్చేస్తుంది. స్వరకల్పన ఇలా కూడా ముగించవచ్చా! అనే నిబిడాశ్చర్యంతో వుండిపోతాము. ఇటువంటి ప్రయోగాలు, అందమైన స్వరకల్పనలు సుందరంగా, సున్నితంగా చేసిన కచేరీలు, రికార్డింగులు ఎన్నో విన్నాం మేము. అంతేకాదు, స్వయంగా కూడా వారితో పాటు పాడుతూ అనుభవం పొందేం. వారిలా అంతందంగా, వయ్యారంగా, ఒకావృతం స్వరకల్పనగా ఎవరూ అంత బాగా వేయలేరని

డా॥ ఎస్.ఆర్. జానకిరామన్ గారు కితాబిచ్చారు. సెమ్మంగుడి వారు గూడా ఒకావృతపు స్వరకల్పనలను బాగా వేసేవారు. ఈ స్వరకల్పనా మాధుర్యం, ప్రజ్ఞ గురువుగారికే సాధ్యం.

**వారి గురువులు :** ద్వారం నరసింగరావు నాయుడు గారి దగ్గర సంగీతం నేర్చుకుంటున్న సందర్భంలో వారు ఎటువంటి ప్రోత్సాహం అందించారన్న విషయం లోకానికి తెలియాల్సిన అవసరం వుంది. ఈ విషయాలు మా గురువుగారి ముఖతః మేము తెలుసుకున్నవి. నరశింగరావునాయుడు గారు ఎటువంటి ప్రోత్సాహమిచ్చారు, ఆయనే స్వయంగా గురువైనప్పటికీ కూడా శిష్యుడికి వైలన్ పై సహకరిస్తూ, కృష్ణమూర్తిగారిని ప్రధాన గాయకునిగా చూస్తూ ఉదారహృదయంతో, విశాలదృష్టితో అన్ని ప్రయత్నాలు చేసిన మహాశయులువారు. సాధారణంగా విద్యనేర్పి వదిలేస్తారు గురువులు. బాగో, ఓగో లోకం నిర్ణయిస్తుంది కానీ, నేదునూరి వారి విషయంలో లోకానికి ఆ అవకాశం ఇవ్వకుండా నాయుడుగారే నిర్ణయించారు. ఆయన వల్లే మా గురువుగారు శ్రీపాద పినాకపాణీ గారి సాంగత్యంలో ఎన్నో కీర్తనలు నేర్చుకోవడం, ఆయనతో పాటు ఇంచుమించు 10 సం॥లు గురుకులవాసం చేసే అవకాశం లభించింది. "మీ దగ్గర ఎక్కువ కీర్తనల పాఠం ఉంది. కాబట్టి కృష్ణమూర్తికి నేర్పించండి" అని పంపించారు.

పినాకపాణి గారంటే మా గురువు గారి దృష్టిలో సాక్షాత్తూ పరమాత్మే. వారి పాటలో ప్రతి సంగతిలోనూ పెద్ద గురువుగారే కనిపిస్తారు. ఆ గమకం, ఆ బరువు, ఆ అనుస్వరం, ఆ రాగకల్పన, విస్తారమైన రాగజ్ఞానం - అది చిన్న రాగమైనా, పెద్దరాగమైనా - చిన్న రాగమైనా కన్నడ గౌళను పావుగంట పాడేవారు, జయంతి సేన 20 ని॥లు పాడేవారు. శుద్ధసావేరి, శంకరాభరణం, తోడి, కళ్యాణి, ఖరహరప్రియ - భైరవి అయితే ఇంకాయనకు ఒళ్ళు తెలియదు. ఆయన ఉపాసన రాగదేవత సాక్షాత్కారం కోసం చేసినట్లుగా నాకనిపిస్తుంది. అన్ని అలంకారాలతో, ఆయుధాలతో రాగదేవత సాక్షాత్కరిస్తుంది. ఆయుధాలతో అని ఎందుకన్నానంటే, ఒక కీర్తనలో వర్ణించేటప్పుడు ఆ దేవత యొక్క ఆయుధాలను కూడా వర్ణిస్తారు వాగ్గేయకారులు. అలాగే ఆ రాగదేవత యొక్క అన్ని రకాల ఆభరణాలు, అలంకారాలు, చిన్న చిన్న అందాలు, తళుకుచెక్కులు, ఆ ముద్దు - ఆ మురిపెం, ఆ రాగంతో ఆయన మాట్లాడే విధానం... రాగదేవతతో ఎలా మాట్లాడతారంటే ముందు చిన్న చిన్న సంగతులు వేస్తారు. సంగీత విద్యార్థులందరూ గమనించవలసిన విషయం. అలా ప్రారంభమై అది విస్తారమౌతూ సాగిపోతుంటుంది. బాగా నచ్చిన స్నేహితులతో సంభాషణ పెట్టుకుని ఇతనితో మళ్ళా మనం సంభాషించే అవకాశం లభిస్తుందో లేదో

అన్నట్టుగా, రేపు అన్నది ఉంటుందో ఉండదో అన్నట్టుగా అన్పించినపుడు కొన్ని గంటలపాటు ఎలా సంభాషణ చేస్తామో అలా రాగదేవతతో మా గురువుగారి సంభాషణ ఉంటుంది. ఏ కచేరీకి ఆ కచేరీలో **"అభీ న జావో ఛోడ్ కే, యే దిల్ అభీ భరానహీ"**అన్నట్లుగా ఉంటుంది ఆ సంభాషణ. "నువ్వప్పుడే రాగం (నన్ను) వదిలి ఇంకో దాంట్లోకి వెళ్ళకు" అని రాగదేవత అన్నట్లుగా ఆ రాగపు అంచులు చూసేస్తారు గురువుగారు. అప్పుడప్పుడు "మొన్న జరిగిన కచేరీలో రాగం, స్వరం మరీ విస్తారంగా పాడేసానేమో, మీరూ వెంటవుంటే కొంత నిలవరించి ఉండేవారు" అనేవారు. కానీ, అదెలా కుదురుతుంది? అది రాగదేవత ఆదేశం. పెద్ద గురువు గారి సాంగత్యం వల్ల అద్భుతమైన రాగకల్పనా చాతుర్యం వారికొచ్చింది. పినాకపాణిగారు కూడా వారి పూర్వీకులైన గోవిందస్వామి పిళ్ళై, ఫకీర్‌స్వామి పిళ్ళై, రంగరామానుజయ్యంగ్గారాం వీణధనమ్మాళ్ వంటి వారి పేర్లు వాళ్ళనే దేవతలుగా స్మరించి, వారి గురించి మా గురువుగారికి చెప్తూ, మధ్య, మధ్య సంభాషణల్లో లోతైన అంశాలు చర్చిస్తూ వుండేవారు. ఆ అనుభవాల సారాన్ని మాకందించారు. కర్నూలులో పెద్ద గురువుగారు, మా గురువుగారు, మా నాన్నగారు మేము కలిసి మాట్లాడుకున్న, అనుభవాలు పంచుకున్న సందర్భాలు అనేకం వున్నాయి. అది మాకు లభించిన అదృష్టం.

**స్వర రచనా వ్యాసంగం :** 1970 ప్రాంతంలో 'ఏమొకో చిగురుటధరమున' అనే అన్నమాచార్యుని కీర్తనకు స్వరరచనతో ప్రారంభమై ఆ వెంకటేశ్వరుని దయవలన ఎన్నో కీర్తనలకు అది విస్తృతమైంది. ఈ విషయాన్ని మాకెన్నోసార్లు చెప్పారు పాతాల సందర్భంలో. టి.టి.డి వారి ఆధ్వర్యంలో శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారితో కలిసి కొన్ని కీర్తనలకు స్వర రచన చేసి ఓ సంపుటాన్ని అందించారు. ఆ తరువాత విశాఖలో వుండగా మొట్టమొదటి సంపుటి - దానికి తప్పొప్పులను దిద్దే అవకాశం నాకు గుర్తుకు వస్తోంది. 15-20 సంవత్సరాలలో 150-200 కీర్తనలకు స్వరరచన చేసారు. వారింటిలో మేం వుంటే, అక్కడే విని వారికి పాడివినిపించేవాళ్ళం. విజయవాడలో ఉంటే ఫోన్ చేసి ఆ ట్యూన్ వినిపించేవారు. మేం దాన్ని పాడి ఆయనకు వినిపిస్తే వారికదో తృప్తి. అప్పుడే దాన్ని ఫైనల్ చేసేవారు. వారి దెంత ఔదార్యం. మాదెంత అదృష్టం. మా గొంతులో ఆ వరస ఎంతందంగా వినిపిస్తుందో చూడాలని వారి కోరిక. అలాగే బాలకృష్ణప్రసాద్ గారు కూడా గురువుగారి ట్యూన్స్‌కి నొటేషన్స్ వ్రాశారు చాలా. అలాగే విశాఖలో వుండగానే రామదాసు కీర్తనలకు స్వరరచన కూడా ప్రారంభమైంది. ప్రఖ్యాతమైన "పలుకే బంగారమాయెనా" తో ఆరంభించి అది ఓ గ్రంథమే అయ్యింది. ఈ సందర్భంలో హైద్రాబాద్ వాసి, రామభక్తులు శ్రీ నేంద్రగంటి కృష్ణమోహన్ గారిని గురించి చెప్పాలి. వారిరువురి సాంగత్యంలో సంగీత

లోకానికి అద్భుతమైన సంపద చేకూరింది. వారి వ్యయ ప్రయాసలు సద్యః ఫలాలనిచ్చేయి. వ్యయం నేంద్రగంటి వారిదయితే, ప్రయాస మా గురువుగారిది. 13 ఏళ్ళ పాటు అంగరంగవైభవంగా వీనులవిందుగా, కన్నుల పండువగా భద్రాచలంలో రామదాసు మహోత్సవాలు జరగడం, మా గురువుగారు, నాన్నగారు, మేము, సంగీతలోకమంతా ఇందు పాల్గొనడం ఒక చరిత్ర. మరువలేనిది. నేంద్రగంటి వారిఅల్లుడు విజయకుమార్ గారు – కుమార్తె లలితగారు వీరినీ స్మరించాలి. ఇదొక యజ్ఞంలా సాగింది.

అలాగే ఎస్.వి.బి.సి ఛానల్‌లో అన్నమయ్య కీర్తనలు పాడడం, భక్తి టి.విలో రామదాసు కీర్తనలు, తర్వాత సంగీతరాగాలాపన విశేషాలను మేము శిష్యులుగా పాల్గొన్న కార్యక్రమంలో అందించడం, త్యాగరాజస్వామి వారి అపురూప కీర్తనలు రాగనామం మాత్రమే దొరికిన వాటిని గురువుగారితో కలిసి మేం పాడి రికార్డు చేసే భాగ్యం, ఎడిటింగ్, వాయిద్యీకరణలో పాల్గొనే అదృష్టం మాకు దక్కింది. రికార్డింగులో చిన్నతేడా వచ్చినా, అది ఒక కీర్తనకైనా సరే గురువుగారు హైద్రాబాద్ వెళ్ళి రికార్డింగు చేసి వచ్చే వారు ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా! వారెంత పరిపూర్ణమైన వ్యక్తో అర్థమవుతుంది.

**గురువుగారి శిష్యవాత్సల్యం :**

ఆయన విశాఖపట్టణం వెళ్ళి స్థిరపడే దాకా వారికి ఎక్కువ మంది శిష్యులు లేరనిపిస్తుంది. దీనికి కారణం సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గా వారి బాధ్యతా నిర్వహణ, విస్తృతంగా వారు చేసిన సంగీత కచేరీలు అనిపిస్తుంది. శ్రీ దోమాడ చిట్టబ్బాయి (నాదస్వరం), శ్రీ ఆకొండి శ్రీనివాసరాజారావు, శ్రీమతి కోకా సత్యవతి వంటి కొన్ని పేర్లే వినిపించేవి. అయితే మ్యూజిక్ కాలేజీలో మాత్రం ప్రతీవారం "రాగరసం" పేరు మీద ఒక కార్యక్రమాన్ని రూపొందించి ఆయన ఎక్కడ పని చేస్తున్నా ఒక రాగం గురించి వివరణ ఇస్తూ కీర్తన నుంచి రాగాన్ని ఎలా గ్రహించాలి, వర్ణాల నుంచి ఎలా గ్రహించాలి, జావళీల్లో ఎలాంటి రాగ సంచారముంటుంది, పదాల్లో ఎలాంటి రాగముంటుంది, ఇలా వివిధమైన రచనల్లో రాగస్వరూపం ఎలా ఉంటుంది? – చిన్న రాగాలు కాపి, ఖమాస్ వంటి రాగాలు జావళీల్లో ఎలా ప్రత్యేకంగా కనిపిస్తాయి, అలాగే పెద్దరాగాలు తోడి, భైరవి వంటివి పదాలలో ఎలా కన్పిస్తాయి, త్యాగరాజస్వామి వారి కీర్తనలలో రెండు కళల చౌకంలో ఎంత రాగం ఉంటుంది – ఇలా విశ్లేషణాత్మకమైన కార్యక్రమాలు నిర్వహించిన గురువుగారికి ప్రత్యక్షంగా శిష్యులకు బోధించే అవకాశం కలగలేదనే అనుకుంటాను. విశాఖలో మేము శిష్యులుగా చేరిన తర్వాత మరింత మందికి సంగీతం నేర్పాలని మనసు వారికి కల్గిందనుకుంటాను. ఇది దైవ సంకల్పం.

శ్రీమతి శారదాసుబ్రహ్మణ్యం, శ్రీమతి సరస్వతీ విద్యార్థి, వారమ్మాయి లహరి, కొంతకాలం లలితా చంద్రశేఖర్ గారు, చైతన్య సోదరులకి అన్నమాచార్య కీర్తనల శిక్షణ, ఆంధ్రాయూనివర్శిటిలో మ్యూజిక్ కాలేజి విద్యార్థులకు ప్రొఫెసర్‌గా సంగీతబోధన, మనోధర్మ సంగీత ప్రక్రియలు, వైశిష్ట్యం ఇవన్నీ అక్కడ చెప్పారు. రామదాసు కీర్తనల శిక్షణ శ్రీమతి శేషులతా విశ్వనాథ్‌గారికి, కొన్ని కీర్తనలు లలితా విజయకుమార్ గారికి చెప్పారు. వినయ్‌శర్వ, యమునారామన్, శ్రీనిధి, మాంట్రియల్ సుబ్బనర్సయ్య, శ్రీదేవి రంగరాజన్, గీతాకృష్ణమూర్తి, బెంగుళూరు జయశ్రీ, పద్మా త్యాగరాజు – బాంబే, వంటి వారున్నారు. శిష్య వాత్సల్యంతో పాటు ఏ శిష్యుడికి ఏమి చెప్పాలి? ఎంత చెప్పాలి? అనేది గురువుగారికి బాగా తెలుసు. శిష్యుని బుద్ధి కుశలత బట్టి వారికి చెప్పాల్సిన కీర్తనను చెప్పేవారు. ఆయన కూడా సేవ చేసుకుని, ఆయనతో ఉండే భాగ్యం మాకు గల్గింది. ఇది జన్మాంతర పుణ్యవిశేషమనే భావిస్తాము. మా తాతగారు "తంతే బూరెల గంపలో పడ్డారురా; మీరు అదృష్టవంతులు" అని మాకు కార్డు వ్రాసి అభినందించారు. ఆ కాలంలో వారితో మాట్లాడుతూ సంగీత చర్చలు చేసిన వారిలో ఎల్.ఎస్.ఆర్. కృష్ణశాస్త్రి గారు, పేరాల లక్ష్మణరావుగారు, పేరాల బాలమురళీకృష్ణగారు, రాంబాబుగారు, విజయకుమార్ గారు– వీరందరూ గురువుగారి ఆత్మీయుల్లో కొందరు. వీరందరూ గురువుగారికి చేదోడు వాదోడుగా ఉన్నారు. శిష్యులుగా మేము వయసులో చిన్న వారమైనా స్నేహితులుగా భావించే ఒక ఔదార్యగుణం , 'గాడ్‌ఫాదర్' గా 'గాడ్ అండ్ ఫాదర్' గా వుండేవారు గురువుగారు. వారేదైనా ఒక ప్రాజెక్టు తలపెడితే – పుస్తక ప్రచురణ కావచ్చు, సంగీత కార్యక్రమం కావచ్చు. ముఖ్యంగా "నాదసుధా తరంగిణి" స్థాపించి కచేరీలు ఏర్పాటు చేయడం. ఒకసారి అమెరికా వెళ్ళినపుడు అక్కడ కొంతమంది దాతలనుండి కొంత మొత్తాన్ని సేకరించి – సంగీత విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఏర్పాటు చేసి, అలా ప్రోగుచేసిన డబ్బునంతా ట్రస్టు పరం చేసి సంగీత ప్రచారానికి ఆయన వంతు కృషినందించారు. అలాగే సద్గురు శివానంద మూర్తి గారితో కలిసి ఆంధ్రామ్యూజిక్ అకాడమీ స్థాపన, దాని ద్వారా సంగీత ప్రచారం, విద్యార్థులకు శ్రోతలకు కూడా చక్కని సంగీత వాతావారణం కల్పించేటటువంటి కార్యకలాపాలను నిర్వహించారు. వారి సూచనలు, సలహాలతో చాలా కాలం ఆ సంస్థ నడిచింది.

**గురువుగారి సంగీతశైలి**ని గూర్చి చెప్పాలంటే వారి గాత్రానికి గమకం బాగా అలవాటైంది. ఆయన వైలన్ కూడా వాయిస్తారన్నది కొద్దిమందికే తెల్సు. అలాగే ఆయన గాత్రంలో గమకం, స్ఫురితం, హుంపితం ఈ మూడింటి మేటి కలయిక మరో విద్వాంసునిలో చూడలేము. ఎందుకంటే హుంపితం పాడే విద్వాంసులు

తక్కువ. గమకము, పొడి స్వరాలు, స్ఫురితము వీటి సంపుటీకరణ, అలాగే అందమైన సంగతులు ..... ఎక్కడెక్కడ ఏమి అందంగా ఉంటాయి, కేవలం సంగతులు కాకుండా మంచి ఒత్తులు, ఒంపులు, నొక్కు సంగతులు ఇవన్నీ వారిలో కనబడతాయి. త్రిమూర్తులు పాడినటువంటి సంగీతం ఎంత గమకపుష్టిగా, సంప్రదాయబద్ధంగా ఉంటుందో, దానిలో మరో సంగీతాన్ని (జానపదం కాని, లలిత సంగీతం కాని) అందులో కలిపితే ఆయనకు ఇష్టం ఉండదు. అలాపాడే వారి పేరును కూడా వారు స్మరించేవారు కాదు. సంకరమైన సంగీతాన్ని ఆయన అంగీకరించేవారు కాదు. కర్ణాటక సంగీతంలో శుద్ధత వుండాలి, నొటేషన్ పక్కాగా వుండాలి, రాగం కూడా అంత బాగుండాలి. తమ బుద్ధినుంచి వచ్చే సంగీతం కాకుండా హృదయం నుంచి వచ్చే సంగీతానికి ఆయన విలువ నిచ్చేవారు. కేవలం జనాకర్షణ, ధనార్జన, కేవలం పేరు ప్రతిష్టలు, అవార్డులు ఎప్పుడూ వారు దృష్టిలో పెట్టుకోలేదు. రాజీపడని సంగీతము, బాణీ వారిది. వేళాకోళపు సంగీతాలని ఆయన ఏనాడూ అంగీకరించలేదు. సంగీతం ఒక తపస్సు అని భావించినప్పుడే ప్రయోజనం సిద్ధిస్తుందని వారి దృఢమైన భావన. సంగీతాన్ని ఎలా దర్శించాలి, మన పెద్దలు ఎలా దర్శించారు అన్న విషయాలను వారు చెప్పేవారు. అలవాటుగా వాడే Great, Legendary వంటి పదాలు అందరికీ వాడకూడదని అనేవారు. శెమ్మంగుడి వంటి వారి తరంతోనే ఆ శకం ముగిసిందనేవారు. ఆయనకు మానసిక గురువు శెమ్మంగుడివారు. వారి కచేరీలు ఎన్ని విన్నారో కానీ వారి బాణీ, నాబాణీ ఆమనోధర్మం, ఆ గొంతు, ఆ కల్పనావిధానం, ఆ Nassal touch కొంత కలిసాయనేవారు. నేర్చుకొన్నది పాణి గారి దగ్గరే అయినా శెమ్మంగుడి వారి ప్రభావం, రెంటి సంపుటీకరణే నేదునూరిగారి పాట అని చెప్పవచ్చు. పూజ, జపం, అనుష్ఠానం దసరా వుత్సవాల సమయంలో చాలా నిష్ఠగా, మడిగా పారాయణ చేసి, "ప్రేమ భక్తి సుజన వాత్సల్యము శ్రీమద్రామావరకటాక్షము నేమ నిష్ఠ యశోధన మొసంగునె, నేర్పుగల్గు త్యాగరాజు నేర్చిన సంగీత శాస్త్ర జ్ఞానము సారూప్య సౌఖ్యదమే మనసా!" అన్నట్లుగా ఇవన్నీ కూడా పాటించారాయన. గురువు నేర్పించే సంగీతం ఎప్పుడూ వేరుగా ఉంటుందని, ఇతర సంగీతం ఎగిరిపోయే విస్తరాకులాంటిదని ఎప్పుడూ అంటుండేవారు. గురుపరంపరకి మనమెప్పుడూ బాధ్యులం అనేవారు. కాలానుగుణంగా ఎంత ఆధునికతలు చోటు చేసుకొన్నప్పటికీ కూడా ఇంత నిబద్ధత గల్గిన సంగీత విద్వాంసుని మనం చూడలేము.

వారెంత ప్రాచీనులో అంత అధునికులు కూడా! కచేరీ చేసేటప్పుడు శ్రోతలని దృష్టిలో పెట్టుకోవాలని చెబుతూ అదే సమయంలో విలువలని దిగజార్చవలసిన అవసరం లేదనేవారు. కాలాన్ని బట్టి ఆంధ్రదేశంలో రాను రాను లోతైన, విశేషమైన సంగీతాన్ని విని ఆదరించే శ్రోతలు తగ్గిపోతారనే భావన వారిలో వుండేది. కానీ మనం సంగీతాన్ని నేర్చుకోవాలి, పెద్దల మార్గాన్ని అనుసరించాలనీ విశ్వసిస్తూ వుండేవారు.

తర్వాత ఆయనతో సహకరించిన ప్రక్కవాద్య విద్వాంసుల విశేషాలు ముచ్చటిస్తాను. శ్రీ లాల్‌గుడిజయరామన్, శ్రీ ఎమ్.ఎస్. గోపాలకృష్ణన్ వంటి ప్రీతికరమైన విద్వాంసుల సహకారం వారికి లభించింది. సింహంలా వారితో చేసిన కచేరీలు చరిత్రలో నిలిచిపోయినవి. మ్యూజిక్ అకాడమీ కచేరీ అనంతరం లాల్‌గుడివారే ఎక్కడి వారి సంగీత కచేరీలకైనా సహకారం అందిస్తానని చెప్పారు. ఇంకా చంద్రశేఖరన్ గారు, తిరుప్పాకడల్ వీర రాఘవన్, పేరి శ్రీరామమూర్తి, అన్నవరపు వారు, ఆకెళ్ళ మల్లికార్జునశర్మ, ద్వారం దుర్గాప్రసాదరావు, ద్వారం సత్యనారాయణ, మృదంగంపై పాల్ఘాట్ రఘు, దండమూడి వారు, లక్ష్మీనారాయణరాజు, వెల్లూరు రామభద్రన్, కరైకుడి మణి, ఉమయాల్పురం శివరామన్ , గురువాయూర్ దొరై, కమలాకరరావు, ట్రిచి శంకరన్ వంటి వారలు సహకరించారు. ఇంకా ఎవరినైనా మర్చిపోతే మన్నించగలరు. ఆకాశవాణి కచేరీలలో అపురూపమైన కీర్తనలతో రికార్డై ఉన్నాయి. నేను కూడా వారితో రేడియో కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం కల్గింది. 1991 లో వారికి సంగీత సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వచ్చింది. వారితో పాటే విమాన ప్రయాణం చేస్తుంటే, కొత్త కాబట్టి సీటుబెల్టు కూడా వారేపెట్టారు. నేను, నా తమ్ముడు ఎన్నో కచేరీలు వారితో కలిసి పాల్గొన్నాం. వారి కచేరీకి తంబురా శ్రుతి నా చేత వేయించేవారు. మా నాన్నగారు తంబురా శ్రుతి చేయడంలో దిట్ట. నాకూ అదే అలవడింది. గురువుగారి దయవల్ల మ్యూజిక్ అకాడమీ వంటి అనేక సభల్లో వారితో కలిసి పాడే అవకాశం లభించింది, వారిజీవితంలో 55 సం॥లు మ్యూజిక్ అకాడమీలో పాడడం ఒక చరిత్ర. వారి కుటుంబ సభ్యులు వల్లి, బుజ్జి, విజయశ్రీ, వారబ్బాయి పినాకపాణిల ఆదరణ మాకు లభించింది. వీరందరి సహకారం వల్ల మేము గురువుగారితో మరింత సామీప్యాన్ని పొంది అదృష్టవంతులమయ్యాం.

శ్రీ వివేకానందుల వారు 'గురుశిష్యుల కలయిక జరగాలంటే 'There must be a cosmic necessity' (భగవదనుగ్రహం) ఉండాలి' అన్నట్లుగా శ్రీపాదవారి శిష్యులుగా నేదునూరివారు, ఓలేటి వారు, మా నాన్నగారు, మేము వుండడం ఓ 'బంగారు అవకాశం'. తెలుగుదేశం నుండి వెళ్ళి తమిళనాడులో ఓ చరిత్ర సృష్టించిన ఓలేటి, నేదునూరి వారల సంప్రదాయాన్ని కొనలు సాగించడం అందరికర్తవ్యం. వారి శిష్య ప్రశిష్యుల ద్వారా భావితరానికి ఉత్తమమైన సంగీత మార్గాన్ని చూపించి తరించిన ఉత్తమ సంగీత విద్వాంసులు వారు. వారిద్దరి మధ్య ఒక బంధుత్వం కూడా ఉంది. వారిద్దరూ అనేక సంగీత చర్చలు చేసుకొంటూ వుండేవారు.

నేదునూరి వారిది పిఠాపురం. శ్రీపాదవల్లభుని స్థానం, వారి గురువుగారి ఇంటిపేరు శ్రీపాద (పినాకపాణి). శ్రీ పాదవల్లభుని తల్లి గారి యింటిపేరు మల్లాది. మాకు పిఠాపురానికి గురు సంప్రదాయానికి ఇది దోహదపడిందనిపిస్తుంది. శ్రీపాదవారు గురువుగా లభించడం, పిఠాపురంలో పుట్టిన నేదునూరి వారు గురువుగా లభించడం ఇదంతా భగవత్సంకల్పంగా భావిస్తాము మేము.

దాశరథీ శతక పద్యాలు రికార్డ్ చేయవలసిన అవకాశం వచ్చినప్పుడు, పద్యాలను పాడడంలో అనుభవ శాలి ఆయన మా నాన్నగారి సలహా సంప్రదింపులను పొంది తనదైన పద్ధతిలో వాటిని సంగీతలోకానికి అందించారు.

ఓ సారి మల్లాది చంద్రశేఖర్ శాస్త్రిగారితో మాట్లాడుతూ 'అయ్యా, ఇంకా రాగాల గురించి, రాగ భావాల గురించి కొన్ని అనుమానాలు వుండిపోయాయండి, ఇంకా కొన్ని రాగ విశేషాలు తెలుసుకోలేకపోయానండి' అంటే వారు 'నాకూ ఇలాగే అయింది. పెద్దలను భక్తితో, వినమ్రభావంతో మనస్ఫూర్తిగా ప్రార్థించాను. వారే నా అనుమానాలను తీర్చారు' అన్నారు.

అలానే, నాకూ అలాంటి అనుభవం అనిపిస్తుంటుంది. ఈ నాలుగు మాటలనూ గురువుగారే వినిపించారనుకొంటాను. లేకపోతే నేనేమిటి? గురువుగారి గురించి పలకడమేమిటి? గురువులతో మా జీవితం – మా సంగీత కచేరీల ప్రస్థానంతో పాటుగా 23 సం॥లు సాగింది. వందలాది కీర్తనలను నేర్చుకొన్నాం.

సుబ్బరాయశాస్త్రి గారి తండ్రిగారు శ్యామశాస్త్రిగారు. ఎంతటి విద్వాంసులో చెప్పనవసరం లేదు.కానీ, సుబ్బరాయశాస్త్రుల వారు దీక్షితుల వారి వద్ద, త్యాగరాజస్వామి వారి వద్ద నేర్చుకొన్నారు.

మా పరిస్థితి అలానే ఉంది అనిపిస్తుంది. మహానుభావులు అయిదుగురు కరుణించారు.

1993 లో ఎమ్.ఏ.ఇంటర్వ్యూకి ఒకరోజు భైరవి పాడమన్నారు గురువుగారు. రెండున్నర నిమిషాల్లో ముగించాను. అదేమిటిరా! పంచమం తరువాత సంగతులు లేవా?! అలా పైకి వెళ్ళిపోయావేంటి? అన్నారు.

2014 లో మరోసారి భైరవి పాడమన్నారు. అందులో ఉన్న సంగతులన్నిటితోటి పాడుతున్నాను. 15, 20 ని॥లు వచ్చింది. గురువుగారు ఏమి మాట్లాడలేదు. ఏ భావం కనిపింపచేయడంలేదు. కొద్దిసేపటికి ఇంత రాగం పాడితే అర్థం చేసుకొనే శ్రోతలు రాను రాను కరువైపోతారురా! తగ్గించు అన్నారు.

గురువు చేసే రూపాంతరం చెందించడం (Metamorphosis) ఇదే అనిపించింది.

'గురువే చిల్లగింజ', 'భ్రమరం', 'పరుసవేది' 'ఉత్తమగతి'.

**'గురువు నీవనుకొంటె ధరను దాసునిబ్రోవ త్యాగరాజార్చిత నీ చిత్తము నిర్మలము, నిన్నే నమ్మితి నిశ్చలము'.**

ఇంక కొన్నేళ్ళు ముందు పుట్టి ఉంటే మరిన్ని సంగీత విశేషాలు వారందరి నుండి నేర్చుకుని ఉండేవాళ్ళము కదా! అనిపిస్తుంది. ఒకసారి పెద్ద గురువుగారు పినాకపాణిగారు 'ఇంకొక్క పది ఏళ్ళు ముందు పుట్టి ఉంటే గోవిందస్వామి పిళ్ళై వయోలిన్, నయనాపిళ్ళై గానం వినే అదృష్టం పట్టును కదా'! అన్నారు.

ఇంత వయసులో కూడా గురువుగారు నేను ఇంకా మథించలేదు. ఇపుడు మనసులో చాలా బాగాఉంది సంగీతం, స్పష్టంగాను ఉంది. కానీ, బయటకు రావడంలేదురా! అని మథనపడ్డారు. అదీ సంగీతం. ఎంత చెప్పినా తరగనిదే. సెలవు...

**మల్లాది శ్రీరామ్ ప్రసాద్, సోదరుడు రవికుమార్‌తో... విజయవాడ.**
**సేకరణ : మునుగంటి వెంకట్రావు, గానకళ, కాకినాడ.**



# నేను ... బాలు... కొన్ని జ్ఞాపకాలు

– తనికెళ్ళ భరణి

కైలాసంలో...శివతాండవం ఆగింది....! డమరుకం పేలింది....! రుద్రాక్ష రాలింది....!

ఏకబిల్వమ్... శివార్పణం అయిపోయింది!! సింహపురిలో శివకేశవులిద్దరిమీద హరికథలు చెప్పుకుంటూ ఏడాదికి ఒకసారి త్యాగరాజ ఆరాధనోత్సవాల సమయంలో ఉంఛవృత్తి చేసి, పరమపవిత్రమైన జీవితం గడుపుకుంటున్న శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలగారి ఇంట బంగారు పంట... బాలు.

...

ఎస్.పి.బి... అనే బీజాక్షర సహిత పుంభావ సరస స్వర సరస్వతితో నా జ్ఞాపకాలు...

...

తొలిపరిచయం... నిడదవోలులో... జవ్వాది రామారావుగారి కళాసంస్థ... మా 'కొక్కొరొక్కో' నాటిక వేసిన సందర్భంలో మాకు ప్రథమ బహుమతి వస్తే.. ముఖ్య అతిథి అయిన బాలు గారు నన్ను, తల్లావజ్ఝుల సుందరాన్ని కావలించుకుని "మీలాంటి వాళ్ళు ఉండాల్సింది హైదరాబాదులో కాదు.. అర్జెంటుగా మద్రాస్ రండి" అని ప్రోత్సహించిన సంస్కారి.

...

'కళాసాగర్' నాటక పోటీల్లో; ప్రథమ బహుమతి మళ్ళీ 'కొక్కొరొక్కో' కి వస్తే... "వీళ్ళు సామాన్యులు కాదు" అని... నేను, సుందరంస్టేజి ఎక్కి బహుమతి అందుకునే వరకూ ఆడిటోరియంలో అందరిచేత చప్పట్లు కొట్టించిన సహృదయుడు బాలు.

...నా మొదటి చిత్రం 'కంచు కవచం' రికార్డింగ్.... నేను డైలాగ్స్ రాసిన సినిమాలో వేటూరి రచన, బాలు పాట... అలా చూస్తూ ఉండిపోయా... నా కల పాటై బాలు నోట వినిపిస్తోంది. కాళ్ళకు దణ్ణం పెడితే; గుండెలకు హత్తుకుని... ఎత్తుకుని నెత్తినెట్టుకునే మనిషి!

...

తర్వాత... వంశీ– ఇళయరాజా గారి కాంబినేషన్లో ఎన్నిపాటలు... 'ఆలాపన'.. 'లేడీస్‌టైలర్', 'శ్రీకనక మహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్', 'చెట్టుకింద ప్లీడర్'లోని చల్తీ కా నామ్ గాడి, చలాకి వన్నెలేడి'...! ఎన్ని రికార్డింగ్ థియేటర్లలో పలకరింపుతో కలిసి బాతాఖానీలో.. టిఫిన్స్‌ల, తమాషా ఏమిటంటే సింగర్లు తిండి, నీళ్ళ విషయంలో పరమ జాగ్రత్తగా ఉంటారు... బాలుకు అదేమి లేదు. గుప్పెడు వక్కపొడి, ఎప్పుడైనా సిగిరెట్, కుదిరితే తాంబూలం, గొంతును ఈశ్వరుడికి ఎల్.ఐ.సి చేసినట్టుండేవాడు.

...

నేను బాలు కలిసి కొన్ని సినిమాల్లో నటించే సమయాల్లో నా సాహిత్యం, ముఖ్యంగా 'ఆటగదరా శివ' 'శభాష్ రా శంకరా' విని ముగ్ధుడైపోయేవాడు.'శభాష్ రా శంకరా' సిడీని శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యానికి అంకితం ఇస్తూ... 'భాషా శ్రీపతికి... పాటల పండితుడికి... సుబ్బరమైన బాలుడికి...' అని చమత్కరించాను...

...

కొత్తగా రాసిన 'శివచిలుకలు' అనే శివతత్వాలను వినిపించి, వీటిని మీరు పాడాలి అంటే... కన్నీరు నిండిన కళ్ళతో, 'వద్దు భరణి, వీటికి నీ గొంతే కరెక్ట్... కొంచం 'రా'గా ఉంటే మంచిది... శుభం భూయాత్' అన్నాడు.

...

నేను, జనార్ధన మహర్షి అమీర్‌పేట్‌లో కొనుకున్న మొదటి 2 బెడ్‌రూమ్ ఫ్లాట్ గృహప్రవేశానికి పిలిస్తే వచ్చి, మాతో భోజనం చేసి, సరదాగా గడిపి వెళ్తే... మా బంధువులంతా అలా అవాక్కయి చూస్తూ ఉండిపోయారు.

'బాలు మా ఇంట్లో అడుగు పెట్టేడంటే సాక్ష్యాత్తు ఆ సుబ్రహ్మణ్య స్వామే వచ్చినట్టు పొంగిపోయాం'.

...

ఆస్ట్రేలియాలో ఉండే కోడూరి రామమూర్తి గారు బాలుకి, నాకు కామన్ ఫ్రెండ్. బాలు 'భగవద్గీత' పాడేరు... (ఈ సంగతి చాలా మంది తెలీదు). సి.నారాయణ రెడ్డిగారు, మిగతా ప్రముఖులు ముఖ్య అతిధులుగా చాలా వైభవంగా 'సత్య సాయి నిగమాగంలో' ఆవిష్కరణ జరిగింది... ఆ కార్యక్రమానికి నేనే యాంకర్‌ని. కానీ అదెందుకో పాపులర్ కాలేదు. బహుశా భగవద్గీతను ఘంటసాల మాస్టారుకి, బిల్వాష్టకాన్ని బాలుగారికి కేటాయించాడేమో ఆ పరమేశ్వరుడు.

...

నా 25 సంవత్సరాల సినీ యాత్రని 'వెండి పండగ' పేరుతో రవీంద్ర భారతిలో సంగం అకాడమీ సంజయ్ కిషోర్ నిర్వహిస్తే చాలా మంది సినీ ప్రముఖులు వచ్చారు. చివరిగా బాలు అడక్కుండానే భక్త కన్నప్పలో పద్యాలు పాడి, ప్రేక్షకులంతా 'స్టాండింగ్ ఒవేషన్' ఇచ్చేలా చేసి తన వాత్సల్యాన్ని ప్రకటించారు. వెండిపండగ నాడు నాకదో బంగారు బహుమతి.

...

ఒకసారి చెన్నైలో బాలుగారి ఇంట్లో చరణ్ తియ్యబోయే ఒక ఆర్ట్ సినిమా గురించి చర్చించుకున్నాం. అక్కడే డిన్నర్ చేసి మీద దిగి వస్తుండగా, కాలుజారి, నా బొటనవేలు ఫ్రాక్చర్ అయ్యింది. హైదరాబాద్ వచ్చాక దాదాపుగా ప్రతిరోజూ ఫోన్ చేసి 'కాలు ఎలా వుంది భరణి' అని తగ్గేవరకూ పరామర్శిస్తూ ఉండేవాడు ఆయన.

...

మేమెప్పుడూ కలిసినా తరచూ వేటూరి వారి సాహిత్యంలో చమక్కుల్నీ, ఆ భాషా సౌందర్యాన్ని, భావ శబలతని తల్చుకుని మురిసిపోతూ ఉండేవాళ్ళం. 'వేటూరి వంటి వారు వెయ్యేళ్ళకోసారి పుడతారేమో' అని నేనంటే... 'మా అందరి ఆయుష్షు పోసుకుని నువ్వు వెయ్యేళ్ళు బతకాలయ్యా సుందరయ్యా, అని అంటుండేవాడు బాలు.

మేమే నీ విషయంలో అదే కోరుకున్నాంగా.. కాని ఏది? దెబ్బకొట్టేశావుగా బాలు!

...

ఇక 'మిధునం' సినిమా అనుకున్నప్పుడు మొదట అప్పదాసు వేషం నేను వేద్దామని అనుకుని, చాలా మంది హీరోయిన్లు అంటే హిందీ రేఖ... సుహాసిని..రాధిక...వై.విజయ...శైలజ (బాలు గారి చెల్లి), మృణాళిని (రచయిత్రి) ఇలా చాలామందిని అనుకున్నాకా... లక్ష్మిగారు, బాలు ఫిక్స్ అయ్యారు. బాలు గారికి కథ వినిపిస్తే బావుందని మెచ్చుకుని 'ఔను, నువ్వూ నటుడివే కదయ్యా! ఇంత మంచి పాత్ర నువ్వే వెయ్యచ్చుగా' అన్నాడు. అప్పుడు నేనన్నాను 'స్వామీ నేనే రాసి', నేనే వేసి, నేనే తీస్తే, చివరికి నేనే చూసుకోవాల్సొస్తుందేమో' అంటే నవ్వేసి చాలా తక్కువ పారితోషికం తీసుకొని అప్పదాసు పాత్రకి జీవం పోసాడు.

...

'మిథునం' నిర్మాత మయిద ఆనందరావు గారి ఊరు వావిలవలసలో షూటింగ్. ఆర్ట్ డైరెక్టర్ నాగేంద్ర మూడు నెలల ముందు నుంచే అక్కడికి వెళ్ళి, ఆ పాడుబడ్డ పెంకుటింటిని సరిచేసి, అక్కడ నేను చెప్పిన అన్ని

మొక్కలనీ పెంచి.. సర్వాంగ సుందరంగా,పరమ సహజంగా తీర్చిదిద్దాడు. బాలుగారు లొకేషన్ చూడగానే వాళ్ళవిడ సావిత్రిగారితో 'మనం రిటైర్ అయ్యాకా ఇలాంటి పర్ణశాలలో ఉండాలోయి' అన్నాడు.

ఏది బాలూ? ఆవిడ సావిత్రే... నువ్వే పెద్ద సత్యవంతుడివి... మాట తప్పావు!!!

...

రోజూ మధ్యాహ్నం బ్రేక్ చెప్పగానే తోటలో ఒక బెండకాయని కొరుక్కు తింటూ ఉండేవాడు. 'ఆరోగ్యంగా ఉండాలంటే ఇలాంటి పచ్చివి తింటూ ఉండాలయ్యా' అని ముచ్చట పడుతూ ఉండేవాడు. బాలుని సంతోషపెడదామని ప్రత్యేకంగా ఒక వంట మనిషిని పెట్టి వండిస్తే సాయంత్రం ఆయననవ్వుతూ, 'నువ్వు ప్రేమ చేత అన్నీ వండించేవు గానీ, నేను రెండు గరిటెల కన్నా ఎక్కువ తినకూడదయ్యా... బేరియాట్రిక్ సర్జరీ చేయించుకున్నాగా' అన్నాడు. ఎంత బాధపడ్డానో! కడుపునిండా అన్నం పెట్టేమన్న తృప్తి కూడా లేకుండా పోయింది అప్పదాసూ!!

...

బాలు, లక్ష్మీగార్లిద్దరూ పొద్దున్నే 8 గంటలకు వచ్చేసేవారు లొకేషన్‌కి. ఒంటిగంటకు బ్రేక్. మళ్ళీ 3 గంటలకే షూటింగ్. 6 గంటలకి పేక్ అప్. క్లైమాక్స్ మాత్రం ఒకటి, రెండు రోజులు అర్ధరాత్రి వరకూ జరిగింది... ఇద్దరూ విసుకున్నారు. కెమెరామ్యాన్ రాజేంద్రప్రసాద్‌ని బాలు కేకలేశాడు కూడా! సినిమా చూశాక, కెమెరామ్యాన్‌కి సభాముఖంగా సారీ చెప్పి కావలించుకున్నాడు. దట్ ఈస్ బాలు!

...

షూటింగ్ చివరిరోజుల్లో ఒక సీన్ పొరపాటున డ్రెస్ మార్చి, మళ్ళీ తియ్యాల్సొచ్చింది. ఆయనకి కోపం వచ్చి లొకేషన్‌లో అన్యాపదేశంగా అసిస్టెంట్ డైరక్టర్లని కేకలేశాడు. తప్పెవరు చేసినా బాధ్యత దర్శకుడిగా నాదే కదా... నేను హర్ట్ అయ్యాను... రాత్రి కన్నీళ్ళు పెట్టుకున్నాను. రెండురోజులు మేము మాట్లాడుకోలేదు.

సినిమా అయిపోయింది. నేను ప్యాక్ అప్ చెప్పేశాను.

ఆయన్ని సాగనంపడానికి ముభావంగా కారు దగ్గరకొచ్చాను. ఆయన చొక్కా పట్టుకు లాగి, కావలించుకున్నారు. నేను గాఢంగా కావలించుకుని ఏడ్చేశాను. నన్ను సముదాయిస్తూ, 'చాలా గొప్ప సినిమా తీశావు భరణీ! పది కాలాల పాటు గుర్తుండిపోయే సినిమా తీశావు. నీకు అఖండమైన పేరు వస్తుంది. నీతో పాటు నాకూనూ' అన్నాడు. ఆ ముద్దే నాకు ఆస్కార్ అవార్డ్!

...

ఈ సినిమాలో టైటిల్ సాంగ్ బాలు గారితో కాకుండా జేసుదాసు గారితో పాడించాడు వీణాపాణి. షూటింగ్ టైంలో ఆ సంగతి బాలుకి చెప్పలేదు. షూటింగ్ చివర రోజున వినిపిస్తే 'నా కోసం మా అన్న పాడేడా!' అని పరమానంద పడిపోయాడు. సినిమా రిలీజ్ అయిన తరువాత ఒకసారి నాతో ఇలా అన్నాడు 'ఎప్పుడైనా నేను జీవిత చరిత్ర రాస్తే 'మిథునాన'నికి ముందు, 'మిథునా'నికి తరువాత' అని.. అంతకన్నా ఏ దర్శకుడైనా ఏం ప్రశంస ఉంటుంది? శ్రీపతితో కలయిక... ఐశ్వర్యం. పండితారాధ్యుడితో పరిచయం...యోగం. బాలసుబ్రహ్మణ్యంతో స్నేహం...వ్యసనం...

...

ఇదీ కైలాసమే!

కనకమహాసభ... ఐశ్వర్యానికి నిలయం...మొత్తం బంగారంతో మెరిసిపోతోంది. అంతెత్తు వెండి నంది తన ఉచ్ఛ్వాస, నిస్వాసాలతో బంగారు ఉయ్యాల ఊపుతోంది. ఆది దంపతులిద్దరూ కూర్చున్నారు. ఒకవైపు అమ్మవారు... మరో వైపు అయ్యవారు. పార్వతీదేవి ఒళ్ళో నెల 'బాలుణ్ణి'ఒద్దికగా బజ్జో పెట్టుకుని జోల పాడుతున్న హేల! చిరునవ్వుతో కన్నులరమూసిన పరమేశ్వరుడి లీల!

# నేమాని అంతరంగం

**ప్రముఖ సీనియర్ మృదంగ, ఘట, జలతరంగ విద్వాంసులు శ్రీ నేమాని సోమయాజులు గారి సంగీత ప్రయాణం 50వ మైలు రాయి దాటిన సందర్భంగా గానకళ సహాయ సంపాదకులు - సంగీత ప్రియులు - విశ్లేషకులు శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రిగారు వారి అనుభవసారాన్ని పంచుకొన్నారు. సంగీతప్రియులు కోసం 'గానకళ' దానిని మీకు అందిస్తున్నది.**

ప్రశ్న 1 : నమస్కారం సోమయాజులు గారూ. మీరు మృదంగ విద్వాంసులుగా సంగీత ప్రపంచంలో పయనం ఆరంభించి ఘటవాద్య విద్వాంసులుగా విశేషమైన గుర్తింపు పొంది అనంతరకాలంలో జలతరంగ విద్వాంసులుగా ఖ్యాతిని ఆర్జించారు. స్వర్గీయ చిట్టిబాబు గారి వంటి ఎందరో ప్రముఖ ఆంధ్ర, ఆంధ్రేతర విద్వాంసులతో దేశ విదేశాలలో కచ్చేరీలు చేసిన అనుభవం మీది. మీరు కర్ణాటక సంగీత రంగంలో ప్రవేశించి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మీకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మీ సుదీర్ఘ సంగీత ప్రస్థానానికి సంబంధించిన విషయాలు గానకళ పాఠకులకు తెలియజేయ వలసినదిగా కోరుతున్నాము.

అలాగేనండి. తప్పకుండా.

ప్రశ్న 2 : ముందుగా మీ కుటుంబనేపథ్యం, సంగీతం పట్ల అభిరుచి, అందులో తాళవాద్య శిక్షణను ఎంచుకోవడానికి కారణాలు వివరించండి.

మాది శ్రీకాకుళం. నాన్నగారి పేరు బ్రహ్మశ్రీ నేమాని జగన్నాథం, అమ్మగారు సీతారామం. మాది మధ్యతరగతి కాదు దిగువ మధ్యతరగతి కాదు మధ్యస్తంగా ఉండే కుటుంబం. నాన్నగారు భజనలు బాగా చేసేవారు. అప్పట్లో శ్రీకాకుళంలో కీర్తనలను పాడుతూ భజనలు చేసేవారు నలుగురైదుగురు ఉండేవారు. ఒక్కొక్కళ్లూ ఒక్కో ఏకాహం చేయగల సమర్థులు. అలాంటివారితో కలిసి ఒక్కొక్కరి ఇంట్లో ఒక్కోరోజు భజనలు చేస్తుండేవారు. వాళ్లందరిలోకీ నాన్నగారి గొంతుక, పాట ప్రత్యేకంగా ఉండేది. ఎలా చెప్పుకునేవారంటే బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చింతామణి నాటకమే నాటకం. అలాగే జగన్నాథంగారి భజనే భజన అని. ఆ భజనలు రాత్రి 9 గంటలకు మొదలుపెట్టి రాత్రి 12, ఒంటి గంట వరకు చేస్తుండేవారు. ఆ భజనలకి నేను వెళ్తుండేవాడిని. నాన్నగారితో వెళ్తే తిరిగి వచ్చేటప్పుడు నిద్రపోతే భుజంమీద వేసుకుని తీసుకొచ్చేవారు. అంటే అంత చిన్న వయస్సు నుంచి భజనలకి వెళ్లేవాడినన్నమాట. భజనకి వెళ్ళినప్పుడు భజన కంటే అక్కడ వాయిస్తున్న మృదంగం మీద ఆసక్తి ఎక్కువ ఉండేది. సుందర్రావని ఒకాయన మృదంగం వాయించేవారు. ఆయన్నే ఎలా వాయిస్తున్నారో చూస్తుండేవాడిని. నాన్న గారిని నేను కూడా ఒక్కసారి వాయిస్తానని అడిగితే మావాడోసారి వాయిస్తాడుట ఇయ్యమనేవారు. నేనేం వాయిస్తున్నానో నాకు తెలియదు కాని అందరూ బాగా వాయిస్తున్నానని మెచ్చుకునేవారు. ఇలా నాన్నగారు వెళ్లినా వెళ్లకపోయినా నేను వెళ్లడం సహకరించడం అలవాటు అయిపోయింది.

చదువుకుందుకి వెళ్తున్నానని చెప్పడం భజనకి వెళ్లి వాయించి వచ్చేస్తుండడం. మర్నాడు వాళ్లు మానాన్నగారితో మీవాడు రాత్రి బాగా వాయించాడని చెప్పేవారు. ఆయనకి నేను చదువుకోవడానికి వెళ్లలేదు, భజనకి వెళ్లానని తెలిసిపోయింది.

అప్పుడాయన నాన్నా! అలా కాదు, మినిమం డిగ్రీ చేతులో ఉంచుకుని తర్వాత నీఇష్టం అంతవరకు చదువు అశ్రద్ధ చెయ్యద్దు అని చెప్పారు. సరే మొత్తానికి ఎస్ ఎస్ ఎల్ సీ వరకూ చదువుకున్నాను. స్కూల్లో కూడా తోటివిద్యార్థులెవరైనా పాడుతుంటే ఏ బల్లమీదో వాయిస్తూ ఉండేవాడిని. ఎక్కడైనా

పిల్లలు గుమిగూడి కనబడితే మాస్టార్లు ఏరా అక్కడ నేమానేమైనా వాయిస్తున్నాడా అని అడుగుతూ ఉండేవారు. ఎస్సెల్సీ మాదే చివరి బ్యాచ్, 1969. ఆ పైన టెన్త్ క్లాస్ కోర్సు వచ్చింది. నన్ను కాలేజీలో చేరి పీయూసీ చదువుతావా అని అడిగారు. నేను చదవను, మృదంగం నేర్చుకుంటానన్నాను. మేము నా ఎస్సెల్సీ అయ్యాక ఒక ఆర్నెల్లు ఆముదాలవలసలో ఉన్నాం. శ్రీకాకుళం రోడ్ అని రైల్వేస్టేషన్ ఉంటుంది. అక్కడ వెంకటేశ్వరస్వామి గుడి ఉంది. అక్కడేవో హరికథలు అవీ జరుగుతూ ఉండేవి. అక్కడికి గీతాదేవి అని ఒకావిడ విజయనగరం నుంచి వచ్చి రామాయణం హరికథ చెప్పేవారు. రోజూ వెళ్లిపోవడమే, కథమీద ఇంట్రెస్ట్ కాదు అక్కడ మృదంగం ఆర్టిస్ట్ ఎలా వాయిస్తున్నాడో చూడ్డానికే. వెంపటాపు సత్యం అని విజయనగరం నుంచి వచ్చి వాయించేవాడు. రోజు అతనితో మాట్లాడుతూ ఎలా వాయిస్తున్నాడో గమనిస్తూ ఉండేవాడిని. ఇంతలో ఏమైందంటే మధ్యలో దీపావళి వచ్చింది. అతను ఏవో బాణసంచా కాలుస్తుంటే చేతికి గాయమై వాయించలేక పోతున్నాడు. విజయనగరం నుంచి వేరే ఎవర్నైనా రప్పిందాంమా అని వాళ్లు అనుకుంటుంటే నేను నాకవకాశం ఇస్తే నేను వాయిస్తానన్నాను. నీకొచ్చా బాబూ! అన్నారు వాళ్లు. నాకూ వాయించడం వచ్చు మీరు చూడండి, నాకేమీ ఇవ్వక్కరలేదు అని చెప్పాను. ఇదేదో బావుందని వాళ్లకీ అనిపించి సరేనన్నారు. అలాగ రామాయణం వాయించడం అయిపోయింది. ఆవిడ చాలా బాగా వాయించావు బాబూ, నువ్వు విజయనగరం వస్తే మృదంగం నేర్పిస్తానన్నారు. సరే విజయనగరం వెళ్దామని ఏర్పాట్లు చేసుకున్నాను. మామేనత్తగారు పదిమందిని కూర్చోపెట్టుకుని మధ్యాహ్నం వేళల్లో ఏదైనా పురాణం చెప్తూ ఉండేవారు. ఇలా వెళ్తున్నానని చెప్తే అక్కడ హారతి పళ్లెంలో వచ్చిన డబ్బులు తీసి రెండు రూపాయలు ఇచ్చి వెళ్ళి రమన్నారు. ఆముదాలవల రైల్వే స్టేషన్ వరకూ నడిచివెళ్లి పాసెంజర్ ఎక్కాను విజయనగరం వెళ్లడానికి. అదే మొదటిసారి రైలెక్కడం. విజయనగరం రైల్వే స్టేషన్ నుంచి దాసన్నపేట వరకూ నడిచి అక్కడ మా పిన్నిగారింటికి వెళ్లాను. ఇలా మృదంగం నేర్చుకోవడానికి వచ్చానని చెప్పాను. ఆముదాలవలసలో పరిచయమైన మృదంగం వాయించిన సత్యం ఇల్లు కనుక్కుని వెళ్లాను. ఏమిటి బాబూ ఇలా వచ్చారంటే గీతాదేవి గారి మాట మీద వచ్చిన సంగతి చెప్పాను. అతను ఆవిడ ఇంటికి తీసుకెళ్లాడు. ఆవిడ విషయం విని ముక్తసరిగా ఇక్కడ సంగీత కళాశాల ఉంది, అక్కడ నేను చెప్పానని చెప్పండి, చేర్చుకుంటారని చెప్పి పంపేసింది. అప్పటికి నాకు లోకంతీరు ఎలా ఉంటుందో అర్థమైంది. పైకి గొప్పగా చెప్పేమాటలకీ చేతలకీ ఇంత తేడా ఉంటుందన్న లోకానుభవం నాకు లేదు. ఏంచెయ్యడం, ముందుకు వెళ్లడమా వెనక్కి వెళ్లిపోవడమా. ముందుకే వెళ్దాం, మ్యూజిక్ కాలేజీ అన్నారు కదా అదే చూద్దాం అనే నిర్ణయానికి వచ్చేశాను. ఇప్పుడెక్కడికి వెళ్తారని అడిగాడు సత్యం. వంకాయుల నరసింహంగారి ఇల్లెక్కడో చూపించమన్నాను. ఆయన మీకు తెలుసా అన్నాడు. శ్రీకాకుళంలో మండా కృష్ణప్రసాద్ గారని వాళ్లింట్లో ఏకాహం చేస్తున్నారు. నేనక్కడకి వెళ్లాను. వాళ్లకి మృదంగం వాయించేవారు తక్కువై రావోయ్ రా కూర్చో మృదంగం అందుకో అన్నారు. లోపల ఒకాయన హార్మనీ ముందు కూర్చుని ఉన్నారు. నేను మృదంగం వాయించడానికి వచ్చానంటే వాయించమన్నారు. నాకు శ్రుతి చేసుకోవడం రాదన్నాను. ఆయన శ్రుతి చక్కగా చేసి బోణంకూడా పెట్టిచ్చారు. అప్పుడైనా నాకు సందేహం రావాలి కదా, ఆయన మృదంగ విద్వాంసులేమోనని, అదేంలేదు. ఆయన పాడారు, నేను వాయించాను అయిపోయింది. బాగా వాయించావోయ్ అన్నారు. ఆయన వెళ్లిపోయారు. నేనూ ఇంటికి వెళ్లిపోయాను. సాయంత్రం అడిగాను ఆ వచ్చినాయనెవరని. ఆయనే వంకాయల నరసింహం గారు మంచి మృదంగ విద్వాంసులని చెప్పారు. అరరే ముందు తెలిస్తే ఆయన్నే మృదంగం నేర్పమని అడిగేవాడిని కదా అనుకున్నాను. ఆ విషయమంతా ఈ సత్యంతో చెప్పి నరసింహం గారింటికి తీసుకెళ్లమన్నాను. వాళ్లింటికి వెళ్లాం. ఆయన ఎవరు బాబూ మీరంటే, శ్రీకాకుళం మండా వారింటికి వచ్చారు కదా! అంటూ ఆ సంఘటన గుర్తు చేశాను. అలాగా! బావుంది బాగా వాయించావు అని ఈవేళ శనివారం ఇక్కడ భజన ఉంటుంది ఆగు అన్నారు. భజన తర్వాత ఫలహారాలు అవీ అయ్యాక ఏమిటి ఇలా వచ్చావు అంటే మృదంగం నేర్చుకోవడానికి విజయనగరం

వచ్చాను. ఈవిడ ఇల్లా అంది ఏంచెయ్యాలా అని ఆలోచిస్తూ ఒకసారి మిమ్మల్ని కూడా చూద్దామని వచ్చానని చెప్పాను. మ్యూజిక్ కాలేజీలో చేరితే రెగ్యులర్‌గా క్లాసులు జరుగుతాయి, అక్కడ వీరభద్రరావు గారని లెక్చరర్ ఉంటారు, ఆయనతో నేను చెప్పానని చెప్పు అన్నారు. సత్యంతో కూడా చెప్పారు, మీ గురువుగారి దగ్గరకు తీసుకెళ్లు జాయిన్ చేసుకుంటారు అని. మర్నాడు మధ్యాహ్నం గురువుగారింటికి వెళ్లాం. ఆయన లోపలికెళ్లి గురువుగారితో మాట్లాడి వచ్చాడు. నేనేమో హాలులో సోఫాలున్నాయి, ఒక సోఫాలో దర్జాగా కాలుమీద కాలు వేసుకుని కూర్చున్నాను. గబాలున గురువుగారు వచ్చి చూసి వీడేమిటయ్యా వీడికి నేర్చుకునే లక్షణాలు లేవు పొమ్మను అని చెప్పి లోపలికి వెళ్లిపోయారు. నేను బయటకు వచ్చాను. అప్పుడు సత్యం అన్నాడు, అదేమిటండి గురువుగారి ఇంటికి వస్తే క్రింద కూర్చోవాలి లేకపోతే నిలబడే ఉండాలి, అలా సోఫాల మీద కూర్చుంటారా అని. నాకేం తెలునయ్యా ఈ గురుకులవాసాలూ, పద్ధతులూ అన్నాను నేను. సరే రేపు ఉదయం కాలేజీకి రమ్మన్నారు, అక్కడైనా కాస్త జాగ్రత్తగా ఉండండి అన్నాడు. మర్నాడు కాలేజీలో బాబూ ఇలా కూర్చో, ఇప్పుడు చెప్పు! నువ్వేమైనా వాయిస్తావా అని అడిగారు గురువుగారు. ఏదో కొంచెం వాయిస్తానండి అన్నాను. వాయించు అన్నారు, తాళం వెయ్యండి అన్నాను గబాలున. అలా అనకూడదు. అజ్ఞానం. పద్ధతులు తెలియక. ఆయనకి చటుక్కున కోపం వచ్చేసింది. ప్రక్కనెవరో విద్యార్థి ఉంటే అతన్ని వెయ్యమన్నారు. బయటకు వచ్చేసారు. నేను మొదలుపెట్టి మొత్తం నాకొచ్చినదంతా వాయించేశాను. ఎక్కడ చెప్పనంటారోనని నాభయం. లోపలికొచ్చారు. వచ్చి, చాలా బాగా వాయించావు, రెండేళ్లలో మహావిద్యాంసుడవయ్యే అవకాశం ఉంది అన్నారు. గురువుగారి నోటివెంట వచ్చిన మొదటి ఆశీర్వచనం. సంతోషం అన్నాను. అయితే ఎక్కడుంటావు, ఏం చేస్తావు అన్నారు. మాకెవరూ లేరండి అన్నాను. అయితే వారం భోజనాలు చేస్తావా అన్నారు. చేస్తానండన్నాను. మా ఇంట్లో గురువారం ఇస్తాను అన్నారు గురువుగారు. నరసింహం గారు శనివారం మా ఇంటికి వచ్చెయ్యి ఆరోజు రాత్రి భజనలో కూడా నువ్వు ఉండొచ్చు అన్నారు. మా గురువారి ఇంటి ప్రక్కనే బొల్లాప్రగడ వారని ఎల్లైసీలో పనిచేసేవారు వాళ్లెమో మంగళవారం ఇచ్చారు. శుక్రవారం పూడిపెద్ది చిట్టెమ్మగారని నాకు వరసకి నాయనమ్మ అవుతుంది ఆవిడ ఇచ్చింది. వాళ్ళింట్లో గురువారం నాడు పుట్టపర్తి సాయిబాబా భజనలు అవుతుండేవి. అప్పుడప్పుడే బాబాగారి గురించి బయట ప్రపంచానికి తెలుస్తున్న రోజులు. వాళ్లు అప్పటికే పుట్టపర్తి వెళ్లివస్తూ అక్కడి విశేషాలు చెపుతూండేవారు. అక్కడ మినర్వా టాకీస్ ఎదురుగా కృష్ణా మెటల్ వర్క్సు అని షాపుంది. వాళ్లు మాకు కొంచెం దూరపు బంధువులు. వాళ్లింటికెళ్లి చెప్తే దానికేముందిరా మా ఇంటికి ఆదివారం వచ్చేయ్ అన్నారు. ఆయనకి తెలుసున్న రెండు హోటల్స్‌లో చెప్పారు. మినర్వా హోటల్ అని ఒకటి శ్రీకృష్ణా లంచ్ హోమ్ అని ఒకటి. మొత్తానికి ఏడు రోజులూ కుదరిపోయాయి. అందరూ నేను వెళ్లేరోజు నాకేది ఇష్టమో అది చేసిపెట్టి చక్కగా నాలుగు సంవత్సరాలు నాకేమీ లోటు లేకుండా చూశారు. ఆ మర్నాడునుంచి సంక్రాంతి సెలవులు. గురువుగారు అబ్బాయ్ మీ ఇంటికెళ్లిపోయి సెలవలయ్యాక జనవరి 18కి వచ్చి జాయిన్ అయిపో అని చెప్పారు. నేను ఆ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసుకుని వచ్చి కాలేజీలో చేరాను.

ప్రశ్న 3 : విజయనగరం కళాశాలలో శిక్షణ, ప్రారంభ గురువెవరు, అక్కడి విషయాలు చెప్పండి.

అక్కడ మృదంగం శిక్షణకు చేరాను. పూర్వజన్మ సుకృతంవల్ల నాకు గొప్ప గురువు దొరికారు. అందువల్లే నా సుదీర్ఘ సంగీతయాత్ర ఇంత విజయంతంగా సాగుతోంది. ఆయన శ్రీ కాట్రావులపల్లి వీరభద్రరావు గారు. విజయనగరం సంగీత కళాశాలలో మృదంగం అధ్యాపకులు. తొలిగురువే కాదు నాకు ఏకైక గురువు ఆయనే. ఆయన ముళ్లపూడి లక్ష్మణరావు గారి శిష్యులు. వారిది ముళ్లపూడి వారి బాణి. ముళ్లపూడి బాణీ అంటే బోధనా విధానం చాలా గట్టిది, సమగ్రమైనది. అక్కడ నేర్చుకున్నాక వేరే గురువుల దగ్గర ఇంకా మెరుగులు దిద్దుకునే అవసరం నాకే కాదు ఏ శిష్యునికీ ఏర్పడదు. నాకు దొరికిన మరో అపురూపమైన అవకాశం వారూ నేనే సుదీర్ఘకాలం కలిసి అంటే ఆయన మృదంగం, నేను ఘటం వాయించే అవకాశాలు రావడం. అందువల్ల నేను 10 సంవత్సరాలు వారివద్ద శిక్షణ

పొందడమే కాకుండా కలిసి వాయించడంతో శిక్షణ ఇంకా కొనసాగిస్తున్నట్లయింది. నేను చేరడానికి వెళ్లిన సమయానికి ఆ ఏడాది విద్యాసంవత్సరం ఇంక మూడు నెలలే మిగిలి ఉంది. అందువల్ల మామూలుగా క్లాసులకు వస్తూండని చెప్పారు. వేసవి సెలవల్లో కూడా అక్కడే ఉండి చదువుకోమని మరుసటి సంవత్సరం రెండో సంవత్సరంలో చేర్చుకున్నారు. ఒకవైపు గుంచి, 'అయ్యకోనేరు' ఒకవైపు ఉంటుంది. అక్కడ ఆంజనేయస్వామి కోవెల కూడా ఉంది. చొప్పెల్లి సూర్యనారాయణ భాగవతార్ త్యాగరాజోత్సవాలు చేసేవారు. నేను అక్కడ ఉండేవాడిని. అక్కడ విద్యార్థులు, రిటైరై వీరు ఒక్కరూ ఉండేవారు ఇటువంటి వారికి ఉండడానికి వసతి ఉండేది. అక్కడ రిజర్వేషన్. ఈ అబ్బాయి చదువుకుంటున్నాడని నాకు ఇచ్చారు. అలాగే సరస్వతుల వెంకట్రావు గారని గాత్ర విద్వాంసులు, ఘంటసాల సహపాఠి, ఆయన ఉండేవారు. ప్రొద్దున్న మాపిన్నిగారింటికెళ్లి చద్దన్నం తిని వచ్చి కచ్చితంగా 7 గంటలకు గురువుగారింటికి ఒకసారి వెళ్లి కనబడి ఏదైనా పనిఉంటే సాయపడి అక్కడినుంచి కాలేజీకి వెళ్లడం, తరువాత ఎవరింట్లో వారమైతే వారింట్లో భోజనం చేసి ఒకసారి గురువుగారి ఇంటికి వెళ్లి ఏదైనా పని ఉందేమోనని కనబడివచ్చేసేవాడిని. మధ్యాహ్నం సమయంలో గురువుగారు పడుకుంటారు. ఆయనే తలుపు తీస్తారు. నిద్రాభంగమౌతుందని వెళ్లేవాడిని కాదు. సాయంత్రం కాలేజీలో ప్రాక్టీసు. రోజుకి 16 గంటలు సాధకం చేసేవాడిని. అలా రోజులు గడుస్తూండగా ఒకరోజు గురువుగారు పొరుగూరికి వెళ్లవలసి వచ్చింది. ఇంట్లో సాయం ఎవరూ లేరు. అంటే గురువుగారి భార్య, ఒక పాప ఇద్దరే ఉంటారు. రాత్రి పడుకోడానికి సాయం ఎవరూ లేరు, మన సోమయాజుల్ని రమ్మందామా అనుకుని నాకు చెప్పారు. ఏమోయ్, వచ్చి ఉంటావా అని, తప్పకుండా ఉంటానండన్నాను. ఎక్కడుంటున్నావని అడిగారు. గుంచిలో ఉంటున్నానండి అన్నాను. అయ్యో గుంచిలో ఉండడం ఏమిటి, వచ్చేయ్ మా ఇంటికొచ్చేయ్ అన్నారు. ఆ రోజున నేను మొదటిసారి ఒక ప్రమోషన్‌గా ఫీలయ్యాను వారింటికి రావడం అంటే. అప్పటించీ గురువుగారి ఇంట్లోనే పడుకోవడం. అప్పుడు అమ్మగారు నాకు కొన్ని పద్ధతులు నేర్పారు. గురువుగారు పడుకున్నాక పడుకోవడం, మళ్లా గురువుకంటె ముందులేవడం, ఆయన బాత్రూమ్ కి వెళ్లొచ్చే లోపల ప్రక్కబట్టలు సరిపెట్టడం, రాత్రి ఆయన భోజనం అయ్యాక ప్రక్క వెయ్యడం చేసి, పడుకున్నాక కాళ్లు పట్టేవాడిని. పాదసేవ చేసేవాడినన్న మాట. చేశాకే నిద్రపోయేవారు. అదేమిటో నేను చెయ్యివేస్తేనేకానీ ఆయనకి నిద్ర వచ్చేదికాదు. ఇంకా రాలేదా సోమయాజులు అని అడిగేవారు. నేను రాగానే చూడు నాయనా నిన్ను రమ్మంటున్నారనేవారు అమ్మగారు. నేనలా చెయ్యివెయ్యగానే నిద్రపట్టేసేది. అంత అలవాటైపోయింది. కొంచెం చనువు పెరిగి నమ్మకం కుదిరాక ఆయన ఎక్కడికి వెళ్లినా వెనకాల గొడుగు పట్టుకు వెళ్లడం ఆ బ్యాగ్ చేత్తోపట్టుకుని గొడుగు వేసేవాడిని. ఒకరోజున ఆయనతోపాటు రిక్షాలో కాలేజీకి వెళ్లాను. ఆదొకటి ఇంకొక ప్రమోషన్ క్రింద ఫీలయ్యాను, అది ఎవ్వరికీ ఏ శిష్యుడికీ దక్కలేదు, అంతమంది శిష్యులున్నా అది నాకే దక్కింది. కాలేజీకి వెళ్లేసరికి, ప్రిన్సిపాల్ అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు ప్రిన్సిపాల్ ద్వారం భావనారాయణరావు గారు నన్ను పిలిచి అడిగారు, నువ్వేంచేశావయ్యా ఆయన మహా స్ట్రిక్ట్, ఆయన దగ్గర నేర్చుకోవడం చాలా కష్టం, ఆయన్ని ఎలా బుట్టలో వేశావు అని. నాకు బుట్టలో వెయ్యడాలు ఏవీ నాకు తెలియదండీ ఆయన సేవ చేసుకోవడమే నాకు తెలుసు, అంతకంటే తెలియదని చెప్పాను. తరువాతి రోజుల్లో చిట్టిబాబు గారితో గురువుగారూ నేనూ విశాఖపట్నం విశాక మ్యూజిక్ అకాడమీలో కచేరీకి వాయించినప్పుడు భావనారాయణరావు గారు వందనసమర్పణ చేస్తూ మాట్లాడారు. చిట్టిబాబు గారిని, గురువు గారిని అభినందస్తూ మాట్లాడాక నా విషయం చెప్తూ నీడ ఒక మనిషిని వెన్నంటి ఎలా అనుసరిస్తూ ఉంటుందో సోమయాజులు అలా వాళ్ల గురువుగారి కూడా ఉండి విద్య నేర్చుకున్నాడు అని ప్రశంసించారు. అంత పెద్దమనిషి అలా మెచ్చుకోవడం నాకు చాలా సంతోషమనిపించింది. నాకు చిన్న చిన్న పనులు చెప్పేవారు, కిరసనాయిలు, బొగ్గులు తేవడం ఇల్లాంటివి. ఓరుగంటి ఆంజనేయ భాగవతార్ అని ఉండేవారు. ఆయన ఒకమాటు గురువుగారికి చెప్పారు. ఆ అబ్బాయి ఎవరనుకుంటున్నావు ఒకప్పుడు విజయనగరంలో గొప్పగా బతికినవాళ్లు, ఈ ఆస్తులు బిల్డింగులూ అవి వాళ్లవే, కాలక్రమేణా

పరిస్థితులు మారి వాడిక్కడ వారం భోజనాలు చేసుకుంటున్నాడు, కాబట్టి వాడికి కొంచెం మంచి పనులు, ఉన్నతమైన పనులు చెప్తూండని చెప్పారు. నేను ఎస్సెల్సీ పాసయ్యాను కాబట్టి బ్యాంకు పనులు ఇలాంటి పనులు అప్పచెప్పేవారు. ఒకరోజు కాలేజీలో గురువుగారు ఎంతదాకా వచ్చింది పాఠం అని అడిగారు. ఏం చెప్పలేదండి అన్నాను. చెప్పలేదా, మరి అడగలేదేమన్నారు. నేనడిగినప్పుడు కంటే మీఅంతట మీరు చెప్పిన పాఠం బావుంటుందని ఆగానన్నాను. సరే అయితే వ్రాసుకో అని ఒక పుస్తకం ఇచ్చారు. అందులో నాలుగేళ్ల కోర్సు ఉంది. వ్రాసుకున్నాను. వచ్చిందా! అన్నారు. వచ్చిందన్నాను. ఏది వాయించన్నారు. వాయించాను. నాలుగేళ్ల పాఠాలు వచ్చేశాయి. బావుందన్నారు. నా అభిప్రాయం ఒక్కటే. గురువుగారు రోజూ చెప్పక్కర్లేదు. ఆయన అనుగ్రహం ఉంటే అదే వస్తుంది. ఇది నా నమ్మకం. రోజూ గురువుగారు వాయిస్తూ ఉంటే నేను తాళం వేస్తూ ఉండేవాడిని. ఇలా పాఠాలు సాగుతున్నాయి. కాలేజీలో ఆ సంవత్సరం ఫైనల్ ఇయర్ కి విద్యార్థులులేని పరిస్థితి ఏర్పడింది. అది బావుండలేదని మా అధ్యాపకులు రెండో సంవత్సరంలో ఉన్న మన సోమయాజులునే డబుల్ ప్రమోషన్ ఇచ్చి సమర్థుడే కనుక ఫైనల్ ఇయర్ కి పంపితే ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నారని నాకు తెలిసింది. అదే నిజంగా జరిగింది. నేను ఫైనల్ ఇయర్ విద్యార్థినయ్యాను. ఆ సంవత్సరంతో కోర్సు పూర్తైపోయింది. ఉత్తీర్ణుడనైనాను. కాలేజీకి నూరుశాతం రిజల్ట్. కాలేజీలో చదువు పూర్తయ్యాక కూడా ఒక సంవత్సరం విజయనగరంలో ఉన్నాను. ఈ వారాలు చేసుకోవడం అదీ చుట్టాలకి నచ్చేదికాదు. జీవితం ఒక లాటరీ వేసినట్లు వేశాను. ఇప్పుడు బతికిబావుండి పైకొచ్చాం కాబట్టి టీవీలో అక్కడా చూసి మావాడే మావాడే అంటున్నారు.

ప్రశ్న 4 : మరి ఘటంవైపు ఆకర్షితులౌడం ఎలా జరిగింది ?

దానికొక నేపథ్యం చెప్పాలి. శ్రీకాకుళంలో చదువుకునే రోజుల్లోనే రామ్మూర్తిగారని అరవాయన విజయనగరం నుంచి వచ్చి తిమ్మరాజు శివరావుగారింట్లో భరతనాట్యం నేర్పేవారు. ఆ రోజుల్లో ద్రాక్షపళ్లు కుండలలో పెట్టి వచ్చేవి దూరాల్నుంచి. ఆ ఖాళీ కుండలు అమ్మేవారు. పావలా దాని ఖరీదు. అలాంటిదొకటి కొనుక్కొని శుభ్రం చేసుకుని శనివారం ఆయన వచ్చినప్పుడు ఆయన పాఠానికి తగ్గట్టు వాయిస్తుండేవాడిని. విజయనగరం కాలేజీలో చేరాక కూడా మధ్యాహ్నం సమయం రామ్మూర్తి గారింట్లోనే గడిపేవాడిని. ఆయన ఒక్కరే ఉండేవారు. రావోయ్ పంతులూ అనేవారు. రోజూ చాయ్ తాగడానికి 10 పైసలు ఇచ్చేవారు. రామ్మూర్తి గారు నవ్వుతూ కార్యక్రమాలకి సహకారవాద్యం అందివ్వాలి అనేవారు. ఆప్రకారమే 1971లో విజయనగరంలో **గణపతి నవరాత్రుల సందర్భంగా** జరిగిన ఆయన శిష్యుల భరతనాట్యం ప్రోగ్రామ్‌లో మృదంగం వాయించడానికి స్టేజి ఎక్కాను. అదే నా సంగీతయాత్రలో మొట్టమొదటి కచేరీ. ఒకరోజు కాలేజీలో అక్కడున్న ఘటం తీసుకుని వాయిస్తున్నాను ఎవరూలేని సమయంలో. గురువుగారు వెనకనుంచి విన్నట్లున్నారు. తరువాత నీ ఘటవాద్యం బావుంది handling కూడా చాలా బాగా కుదిరింది విడిచిపెట్టకుండా అభ్యాసం చెయ్యి, ఒక చక్రవర్తిలా ఏల్తావు అని ఆశీర్వదించారు. దాంతో అన్నాళ్లూ ఉత్సాహం రూపంలో ఉన్న ఘటవాద్య అభిలాష, శాస్త్రీయంగా నేర్చుకోవాలనుకోవడం తద్వారా నా సంగీతయాత్రలో ముఖ్యమైన మలుపుగా మారడానికి బీజం పడింది.

ప్రశ్న 5 : విజయనగరంలోని సంగీత కార్యక్రమాలు, మీపై వాటి ప్రభావం వివరించండి.

జ : కాలేజీలో మంగళవారాలు జరిగే కచేరీలలో మృదంగం, ఘటం వాయిస్తుండేవాడిని. చిన్నా పెద్దా ఎవరి కార్యక్రమాలైనా తాళం ధైర్యంగా వేసేవాడిని. పెద్ద పెద్ద విద్వాంసులు వచ్చి కచేరీలు చేసేవారు. టి.ఆర్. మహాలింగం, ఈమని శంకరశాస్త్రి, బాలమురళీకృష్ణ ఇలా ఎందరో, లాల్గుడి జయరామన్ తో పాల్ఘాట్ మణి అయ్యర్ మృదంగం వాయించడానికి వస్తున్నారని తెలిసి ఎక్కడెక్కడినుంచో జనం వచ్చారు. విపరీతమైన జనం. మణి అయ్యర్‌కు ఎవరూ తాళం సరిగా వెయ్యలేకపోయారు. నేను దూరంగా కూర్చుని తాళం వెయ్యడం చూసి దగ్గరగా రమ్మని పిలిచారు. ఆయన నేను సరిగా వేశానని సంతోషించారు. ఆయన

ఏం వాయించారో నాకు తెలియదు. కానీ నేను కరెక్టుగానే వేశాననే అనుకోవాలి, ఎందుకంటే ఆయన ఎక్కడా ఆగకుండా వాయించారు కాబట్టి. విజయనగరంలో నా మొదటి ఘటవాద్యకచేరి బురిడి లక్ష్మీనారాయణ గారికి గురువుగారు మృదంగం, నేను ఘట సహకారాన్ని అందివ్వడంతో జరిగింది. అలాగే 1973లో పద్మావతీ కేశవరావు అంటే ఇప్పుడు మంచి పేరుప్రఖ్యాతులు తెచ్చుకుంటున్న పత్రి సతీష్ తల్లిగారు మా గురువుగారి దగ్గరకు వచ్చి చిన్న చిన్నపిల్లలు కాలేజీకి రావడం కష్టమౌతోంది నన్ను వాళ్లకి నేర్పడానికి పంపమని అడిగారు. నేను వెళ్లి సతీష్ వాళ్ల అన్నయ్యకి ఇంకా కొందరు పిల్లలకి కొన్నాళ్లు నేర్పాను. సతీష్ కి కూడా మృదంగంలో ఓనమాలు నేనే నేర్పాను, చాలా కొద్దిరోజులే అనుకోండి. అప్పుడప్పుడు విశాఖపట్నంలో కూడా వాయించేవాడిని. ఒకసారి ఆనందరాజ్యలక్ష్మి గారి వీణ కచేరీకి మృదంగం పై సహకరించడానికి వెళ్లాను. ఆమె వాసా కృష్ణమూర్తిగారి శిష్యురాలు. కచేరి మొదలౌతుంటే ఆయన వచ్చారు. నేనాయన పేరు విన్నాను కాని అంతకు ముందు చూడలేదు. పూర్తిగా ఉండి విన్నారు. మర్నాడు ప్రత్యేకంగా కాలేజీకి వచ్చి నా గురించి అడుగుతున్నారు, నిన్న వైజాగ్‌లో వాయించాడు, మీ విద్యార్థేనట, పొట్టిగా ఎర్రగా ఉన్నాడు అని. అంతలో నేను కనబడ్డాను. నన్నభినందించి మా గురువుగారితో కుర్రాడిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి వెళ్లారు. తరువాత ఎప్పుడు విజయనగరంలో కచేరీ చేసినా నన్ను తాళానికి పిలిచేవారు. ఆయన కచేరీకి నేను వాయించేదే! అంతలో ఆయన స్వర్గస్థులవడం వల్ల నాకా అవకాశం దక్కలేదు. **(తరువాయి వచ్చే సంచికలో)**

## శ్రీ త్యాగరాజ సంగీత సభ ట్రస్ట్, రామచంద్రపురం

త్యాగ రాజ సంగీత గాన సభ భవనం పునర్నిర్మాణం నకు చేయూత నివ్వండి.

సమాజంలో పాటే ప్రాణంగా, జీవనంగా జీవలక్షణంగా ఉన్న సంగీత కళాకారులను, గాయకులను ప్రోత్సాహించడానికి తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం పట్టణంలో 1985 సంవత్సరంలో స్వర్గీయ మంగళంపల్లి బాలమురళికృష్ణ గారి ప్రోత్సాహంతో త్యాగరాజ గానసభ (ఆడిటోరియం) రూపుదిద్దుకున్నది. త్యాగరాజగానసభకు అను బంధముగా త్యాగరాజ విద్యాపీఠం ద్వారా ఎందరో ఔత్సాహికులకు శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇచ్చిన ఘనత ఈ గానసభకు ఉన్నది. అజరామరమైన సంగీతాన్ని ముందు తరాలకు అందించే కళా పెన్నిధులు ఈ సంగీత గానసభలు.

కానీ 1996 సంవత్సరం లో వచ్చిన పెను తుఫానుకు త్యాగరాజ గాన సభ ఆడిటోరియం దెబ్బతిన్నది. కళామతల్లిని ఓలలాడించిన ఈ గాన సభ శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడ సంగీతం మూగబోయినది. ఈ సంగీత గానసభకు తగినంత ఆర్థికవనరులు లేకపోవడంతో దశాబ్దాలుగా పునరుద్ధరణ నోచుకోలేదు. కొంతమంది కళాభిమానులు, ఔత్సాహికులు ట్రస్ట్‌గా ఏర్పడి శ్రీ త్యాగరాజ గానసభను పునరుద్ధరణకు పూనుకున్నారు. ఒక కోటి తొంభై లక్షల రూపాయల అంచనాతో శ్రీ త్యాగరాజ గానసభా భవనం పునర్నిర్మాణంనకు ట్రస్ట్ వారు సంకల్పించారు.

శ్రీ త్యాగరాజ గానసభా భవనం పునర్నిర్మాణంకు కళాపోషకులు, కళాభిమానులు, దాతలు తమ చేయూతను అందించవలసినదిగా కోరుచున్నాము.

**శ్రీ త్యాగరాజ సంగీతసభ ట్రస్ట్,**

రామచంద్రపురం, తూర్పుగోదావరిజిల్లా,

వివరాలకు: 9949991626, 9440017280.

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## విశాఖ మ్యూజిక్ అకాడమీ - విశాఖ 52వ వార్షికోత్సవ సంగీత సభలు

కోవిడ్ కారణంగా గత కొన్ని నెలలుగా సంగీత కార్యక్రమాల నిర్వహణ కష్టమైపోతున్న రోజులలో, విశాఖ మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన వార్షికోత్సవ సంగీత సభలు విశాఖ రసజ్ఞులకు మధురమైన సంగీతామృతాన్ని పంచిపెట్టాయంటే అతిశయోక్తి కాదు.

2019 లో అకాడమీ స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించి, కరోనా కారణంగా 2020 లో కేవలం 51వ వార్షికోత్సవాలను అంతర్జాల మాధ్యమంలో నిర్వహించిన తరువాత, పరిస్థితి కాస్త సర్దుకోవడంతో 52వ వార్షికోత్సవ సంగీత సభలను స్థానిక కళాభారతి ఆడిటోరియంలో 26.11.2021 నుండి1.12.2021 వరకు ఆరు రోజులపాటు ఆసక్తికరంగా వచ్చి కూర్చున్న విశాఖ సంగీతాభిలాషుల మధ్య, ఘనంగా విజయ వంతంగా నిర్వహించి సంగీతసేవ పట్ల తన నిబద్ధతను మరొక్కమారు చాటి చెప్పింది.

వేడుకల శుభారంభం 26.11.21 నాటి సాయంత్రం సరిగ్గా 6.15 ని., వేదికపై అకాడమీ అధ్యక్షులు డా. యంస్వీ రంగరాజన్, ఛీఫ్ పాట్రన్ డా. యస్.విజయకుమార్, డైనమిక్ కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్, కోశాధికారి శ్రీ వీరఘంట చంద్రశేఖర్ గారలు మరియు నాటి సభలో గానం చేయనున్న శ్రీమతి గాయత్రి వేంకటరాఘవన్ గారు ఉండగా, చిరంజీవులు శృతి -లయ లు గానం చేసిన గణపతి ప్రార్థనతో, జ్యోతి ప్రజ్వలనతో జరిగింది. వారి వారి క్లుప్తమైన సందేశాల అనంతరం 6.30 నికు ఆరంభమైన శ్రీమతి గాయత్రి వెంకటరాఘవన్ గారి గాత్ర సంగీత సభ 10.15 ని వరకూ సుమారు నాలుగు గంటలపాటు హాలు నిండుగా నున్న విశాఖ రసజ్ఞుల కరతాళధ్వనుల మధ్య రసవత్తరంగా, మనోరంజకంగా సాగింది. దక్షిణామూర్తిపై శ్లోకంతో శహనవర్ణం గణపతి ప్రార్థనగా నాటరాగంలో "మహాగణపతిం'' కృతి, తరువాత కామవర్ధిని రాగంలో "శంకరినిన్నే" కీర్తనను నెరవల్, స్వరకల్పనలతో పూర్తి సంగీత వాతావరణం హాలులో అలముకునేలా వినిపించారు.

కేదారగౌళ రాగంలో "కొలువుడీ భక్తి" కీర్తన, శ్రుతిరంజని రాగంలో "ఏదారి సంచరింతురా" కీర్తనలు గాయనికి గల గాత్ర మధురిమను తెలియజేశాయి. ముఖ్యాంశమైన ఖరహరప్రియ రాగాలాపన, "నడచి నడచి'' అనే త్యాగరాజకీర్తన, స్వరకల్పనలు సంగీతప్రియులను ఆనందపారవశ్యంలో ఓలలాడించాయి. అప్పుడు ఆరంభించిన "రాగం-తానం-పల్లవి", హంసవినోదిని రాగంలో ''భగవతి సరస్వతి నమామ్యహం - పరమహంస వినోదిని'' అన్న సాహిత్యంతో, మంచి ఉత్తేజభరితంగా నడిచింది. ఖండజాతి త్రిపుటతాళంతో, రేవతి, హిందోళ, సింధుభైరవి రాగాల రాగమాలిక స్వరకల్పనలతో రసికులను కట్టిపడేసింది. వాయులీనంపై శ్రీ మైసూరు వి.శ్రీకాంత్ తగిన రీతిలో సహకారం అందించి రక్తి

కట్టించగా, మృదంగంపై శ్రీ పి.యస్.ఫల్గుణ్ మరియు ఘటంపై శ్రీ యమ్.హరిబాబు గారలు దీటైన లయ విన్యాసంతో తమ ప్రతిభను తెలియజేసారు. ఈ కళాకారులు నాలుగు గంటలపాటు ప్రేక్షకులకు సమయం తెలియకుండా జేయడం విశేషం.

రెండవరోజు 27.11.21 నాటి సాయంసంధ్యలో చెన్నై నుండి విచ్చేసిన శ్రీమతి సిక్కిల్ మాలా చంద్రశేఖర్ తన మురళీగాన తరంగ డోలికలలో శ్రోతలను ఆనందపరిచారు. నాలుగు దశాబ్దాల అనుభవమున్న ఈ కళాకారిణి మురళిపై సుధలనందించే మోహనరాగ వర్ణంతో ఆరంభిస్తూ, శుద్ధ ధన్యాసి రాగంలో "సుబ్రహ్మణ్యేన" అన్న దీక్షితులవారి కృతిని చిక్కని స్వరకల్పనలతో వినిపించారు. తరువాత ఆనాడు స్థిరవాసరం కావడంచేత భుజంగిణి రాగంలో "ఎదుటనున్నాడు వీడే" అన్న అన్నమయ్య రచననూ, ఖరహరప్రియరాగాలాపనతో పాపనాశశన్ శివన్ రచన "శ్రీనివాస తవచరణం" అన్న కృతులతో వీనుల విందొనరించారు. తరువాత గౌళిపంతు రాగంలో "కరుణయేదమ్మ" అన్న మణిప్రవాళ సాహిత్య రచనను, నవరసకన్నడ రాగంలో అందరికీ తెలిసిన "నినువినా" కీర్తనను వేగంగా వినిపించి కరతాళధ్వనులందు కొన్నారు. తరువాత కళాకారిణి ధర్మవతి రాగంలో వినిపించిన "రాగం-తానం-పల్లవి", స్వరకల్పనలో రాగమాలికగా అందుకొన్న సామ, హిందోళ, బేహాగ్, రేవతి రాగాలు వాద్యంపై ఆమెకు గల పట్టును తెలియజేశాయి. లలితంగా "జో అచ్యుతానంద, మైత్రీ భజతాం, భజన్ మరియు పహాడీ తిల్లానాలు" శ్రోతలను అలరించాయి. వాయులీనంపై శ్రీ వి.వి. శ్రీనివాసరావు గారి సహకారం రాగాలాపనలో, స్వర కల్పనలలో ఒక వైవిధ్యాన్ని చూపి ప్రత్యేకతను సంతరించుకుంది. మృదంగంపై శ్రీమన్నార్‌కోయిల్ బాలాజీ, ఘటంపై డా.తిరుచ్చి కె.మురళి తమ తమ ప్రతిభను ప్రదర్శించి ప్రశంసాపాత్రులయ్యారు. ఒకప్పటి సిక్కిల్ నీల కుంజుమణి మురళీగాన విద్వాంసులను గుర్తుకుతెచ్చే విధంగా సాగింది కచేరీ.

అకాడమీ వార్షికోత్సవ వేడుకలలో సాధారణంగా ఏర్పాటుచేసే సోదాహరణ ప్రసంగాన్ని ఈమారు ఒక దృశ్యాంశంగా మూడవరోజు అనగా 28.11.21 నాటి ఉదయం 10 గం॥కు స్థానిక "పబ్లిక్ లైబ్రరీ హాలు" లో యేర్పాటు చేసింది.

"పద్మవిభూషణ్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ విరచితమైన అపూర్వ వర్ణములు" అన్న అంశంపై డా.వడ్లమాని ఫణీంద్రుడు గారు ప్రదర్శించిన వీడియో సంగీతాభిమానులకు ముఖ్యంగా విద్యార్థులకు వర్ణముల విషయంలో చాలా వివరాలను తెలియజేసింది. గంభీరనాట రాగంలో "ఏ గానములో ఈ సకలజగము లీనమై వర్తించునో -ఆ నాదమే మురళి" అన్న సాహిత్యంతో, "సప్తస్వరములు నా జీవము" అన్న చరణంతో, సప్తస్వరములతో కూర్చిన సప్త చిట్ట స్వరములతో కూడిన స్వీయరచన బాలమురళి వినిపించడంతో ఆరంభమైంది వీడియో. రాగ లక్షణాలను పూర్తిగా తెలియజేసే విధంగా సంగీతరచన సాగింది.

వాగ్గేయకారులే అవతార పురుషులైనప్పుడు రచన ఎంత గొప్పగా ఉంటుందో మరల చివరను ఆయన వినిపించిన "నీ గరిమగని నీదరిని జేరితిని సదా సామ

నిగమవెూహిని'' అన్నస్వరాక్షర సాహిత్యం తోడిరాగంలో వినిపించడంతో కార్యక్రమం ముగిసింది. మధ్యలో సుమారు గంటసమయం ప్రిన్స్ రామవర్మగారు తన శిష్యులతో కూడి ఆలపించిన చక్రవాక, సౌరాష్ట్ర, సూర్యకాంత రాగాలలో చిట్టస్వరాల రచనలో బాలమురళి ప్రదర్శించిన సాహిత్య సంగీత విలువలను తెలియజేసాయి. ముఖ్యంగా రామవర్మగారు వర్ణం – తానవర్ణంపై తన దృష్టిని సారించడం విశేషం. గంభీరనాటరాగంలోనే సాగిన వర్ణం పాడడానికి సులభమనిపించినా రచన బాలమురళికే సాధ్యం అన్న రామవర్మ మాటలు అక్షరసత్యాలు. ''అమ్మా ఆనందదాయిని – అకార ఉకార మకార రూపిణి – వమ్మ నిను నమ్మి బాలమురళి గానమ్ము చేసి ధన్యుడనైతిని" అన్న సాహిత్యంలో గొప్పతనం చరణం "శివే శివే శివే వేవేల వరాలరాశివే మొరాలించు" అన్న చరణం, చిట్టస్వర సాహిత్యం ఆయన వివరించిన తీరు అద్భుతం. మంచి విషయాలను ప్రేక్షకులకు తెలియజేసిన కార్యక్రమం సమర్పించారు శ్రీ ఫణీంద్రుడు.

సాయంత్రం 6.15 ని. అకాడమీ ప్రతియేటా అందించే "భక్తజ్ఞానానందతీర్థ ఓగిరాల వీరరాఘవశర్మ అవార్డు". ఈ యేడు డా.కొల్లూరు (కొత్తపల్లి) వందన గారికి సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సన్మానసభలో ఆమెకు శాలువ, పుష్పమాల, జ్ఞాపిక, సన్మానపత్రము మరియు చందనమాలలతో సత్కరించి పదివేల రూపాయల నగదు బహుమతిని శ్రీ ధార్వాడ మురళికృష్ణగారి చేతులమీదుగా అందించడం జరిగింది.

తరువాత భైరవి అటతాళవర్ణంతో తన గానం ఆరంభించిన వందనగారు, ఓగిరాలవారి రెండు రచనలను రాగాలాపన స్వరకల్పనలతో వినిపించి తన గౌరవాన్ని తెలియజేశారు. మొదటిది జగన్మోహిని రాగంలో ''కావవే కమలాక్షి'' కాగా రెండవది కానడరాగంలో " మదనారీ వరసుదతి" అన్న రచన. ముఖ్యాంశంగా కాంభోజిరాగంలో త్యాగయ్య రచన "ఎవరిమాట విన్నావో" కీర్తనను రాగభావంతో,లెక్కలతో కూడిన స్వరకల్పనలతో వినిపించి ప్రశంశలందు కొన్నారు వందన. తనదైన రీతిలో "సంకీర్ణనడ తిశ్రజాతి రూపకతాళంలో'' వరాళి రాగంలో ''రాగం–తానం–పల్లవి" ని ఎన్నుకోవడమే గాక రాగమాలికగా కుంతలవరాళి, కోకిలవరాళి, పున్నాగవరాళి వంటి అపురూప రాగాలను చేర్చి అంశానికి మరింత అమృతాన్ని చేర్చి అందించడం గమనార్హం. సింధుభైరవి రాగంలో తిల్లానాతో ముగిసిన ఆమె గానానికి వాయులీన సహకారం డా.కె.వి. కృష్ణ; మృదంగ సహకారం శ్రీ కోటిపల్లి రమేష్, ఘట సహకారం శ్రీ యస్.హనుమంత రావు గారలు యథోచితంగా అందించి మంచి లయవిన్యాసంతో శ్రోతల కరతాళధ్వనులను పొంద గలిగారు.

నాలుగవరోజైన 29.11.21 తేదీనాటిసాయంత్రం ప్రఖ్యాత వాయులీన విద్వాంసులు శ్రీ ఆర్.దినకర్ 'I am presenting SOLO - but I am not SO LOW' అంటూ ఒక 'హాస్యగుళికను' సరదాగా అందిస్తూ ప్రేక్షకులను మైమరపించారు.

"నెరనమ్మితి" అన్న కానడ అటతాళ వర్ణంతోనే రసజ్ఞుల హృదయాలను చూరగొన్న ఈ విద్వాంసుడు వరుసగా, నాటరాగంలో "నిన్నేభజన", గానమూర్తి

రాగంలో ''గానమూర్తి'', ద్విజావంతి రాగంలో "అఖిలాండేశ్వరి", కీర్తనలను వినిపించారు. పంతువరాళి రాగంలో "అప్పరామభక్తి" కీర్తనను రాగాలాపనతో, మంచి మనోధర్మంతో కూడిన స్వరకల్పనలను చేర్చి మనోహరమైన రీతిలో పలికించారు.

నాటకప్రియరాగంలో "మారజనని" అన్న తమ గురువుగారైన శ్రీమాన్ ఎన్.సి.హెచ్. కృష్ణమాచార్యుల వారి రచననందించి గురుభక్తిని తెలియజేసి, ముఖ్యాంశంగా శంకరాభరణ రాగంలో "మనసు స్వాధీనమైన" కీర్తన, తరువాత షణ్ముఖప్రియ రాగంలో "రాగం – తానం– పల్లవి" ని శ్రోతల కరతాళధ్వనుల మధ్య వినిపించారు. సింధుభైరవి రాగంలో "తంబూరి మీటిదవా" అన్న పురందరదాస రచనతో ముగించిన వాయులీనసభ శ్రోతలకు మరపురాని అనుభూతిని కలిగించింది.

మృదంగంపై శ్రీ కె. సద్గురుచరణ్ మరియు ఘటంపై శ్రీయమ్.సూర్యప్రసాదరావు జంట లయవిభాగాన్ని తగిన రీతిలో పోషించి సభకు న్యాయం చేస్తూ రసజ్ఞుల కరతాళధ్వనులందుకొన్నారు.

అయిదవరోజు అనగా 30.11.21 నాడు విశాఖకు చెందిన గాత్రవిద్వాంసులు శ్రీ ప్రాతా కృష్ణమూర్తి గారి గాత్రసంగీత సభ ఉల్లాసభరితంగా సాగింది. కల్యాణిరాగ అటతాళవర్ణంతో సభను ఆరంభించిన గాయకులు సూర్యకాంతం రాగంలో "ముద్దుమోము", ఆభోగి రాగంలో ''సభాపతికి'', నాయకిరాగంలో "రంగనాయకం", బిలహరి రాగంలో "యింతకన్నా ఆనందమేమి", కీర్తనలను రాగభావం, సాహిత్యభావం శ్రోతలకు తెలిసే రీతిలో గానంచేసి వారి మెప్పును పొందారు. యదుకుల కాంభోజి రాగంలో "హే కామాక్షి" అన్న కృతితో కొత్త వాగ్గేయకారులైన "ఆనందవన్ పిచ్చయ్" ను శ్రోతలకు పరిచయం చేస్తూ, వేగంగా ఉమాభరణం రాగంలో "నిజమర్మములను" కీర్తనను వినిపించారు.

ముఖ్యాంశంగా పూర్వీకల్యాణి రాగాలాపనను మనోహరంగా చేసి, "పరమపావనా రామా" కీర్తనను మంచి నెరవల్ స్వరకల్పనలతో ఆలపించి బేహాగ్, అభేరి, వరాళి వంటి రాగాలతో రక్తికట్టించారు కృష్ణమూర్తి.

జనసమ్మోదిని, హంసానంది వంటి అరుదైన రాగాలలో అంశాలతో సభను ముగించేముందు, శ్రీ ధన్వాడ ధర్మారావుగారు మృదంగంపైనా, శ్రీ జి.వెంకటేశ్ గారు మోర్సింగ్ పైనా జంటగా వినిపించిన లయవిన్యాసం శ్రోతలకు మంచి ఆనందాన్నిచ్చింది. శ్రీమతి మంథా శ్రీరమ్య వాయులీన సహకారం హాయిగా సాగి శ్రోతల ప్రశంసలనందుకుంది.

చివరిరోజైన 01.12.21 నాటి సాయంత్రం అకాడమీ తన ప్రతిష్మాత్మకమైన "సంగీత కళాసాగర" బిరుదును వైణిక విద్వాంసులైన శ్రీ అయ్యగారి శ్యామసుందరం గారికి సమర్పించింది. ''ఈ సందర్భంగా ప్రఖ్యాపనపత్రము, జ్ఞాపిక, శాలువ పుష్పమాలికలతో పాటు శ్రీ మల్లాప్రగడ శేషగిరిరావుగారు తమ కుమార్తె శ్రీమతి సంధ్యగారి జ్ఞాపకార్థం సమకూర్చిన బంగారు పతకాన్ని వైణికవిదుషి శ్రీమతి మల్లాప్రగడ జోగులాంబగారి చేతులమీదుగా శ్యామసుందరం గారికి సమర్పించి అకాడమీ సత్కరించింది.

అకాడమీ అధ్యక్షులు డా.యస్వీ రంగరాజన్,

శ్రీమతి మల్లాప్రగడ జోగులాంబగారి చేతులమీదుగా శ్యామసుందరం గారికి సమర్పించి అకాడమీ సత్కరించింది.

అకాడమీ అధ్యక్షులు డా. యస్వీ రంగరాజన్, కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్, కోశాధికారి శ్రీ వీరఘంట చంద్రశేఖర్ మరియు విదుషి మల్లాప్రగడ జోగులాంబ గారలు సభలో పాల్గొని విద్వాంసుని సన్మానించారు. తరువాత అకాడమీ ప్రతియేడు అందించే Artist of Distinction Award ను ఈ యేడు గాయని శ్రీమతి మూలా శ్రీలతకు శాలువ, జ్ఞాపిక, పదివేల రూపాయల నగదు బహుమతితో సహా అందించి సత్కరించింది.

అంతేగాక అకాడమీ వార్షికోత్సవాలలో ప్రతియేటా సంగీతాభ్యాసం చేస్తూన్న పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్స్ రూపంలో ధనసహాయం యిస్తూ వస్తూన్న సందర్భంలో యిరువురు 'బివికె కళాశాల విద్యార్థులైన 1. పి. కల్కి అరవింద్ మరియు 2. జి. అమూల్య కు యీ వేడుకలలో స్వర్గీయ శ్రీమతి రాధాసాయిరామ్ మరియు శ్రీమతి వసంతబాయ్ స్మృత్యర్థం ఆ స్కాలర్‌షిప్ లను అందించడం జరిగింది.

అకాడమీ విశేష సేవలందించిన 'శ్రీ వడ్డిపర్తి నరసయ్య గారిని' అకాడమీ శాలువ, జ్ఞాపికలతో సత్కరించి తన అభిమానాన్ని తెలియజేసింది.

తరువాత జరిగిన శ్యామసుందరం గారి వీణావాదన సభలో మార్దంగికులు శ్రీ వంకాయల వేంకటరమణ మూర్తి మృదంగంపైన, శ్రీ ఎమ్. హరిబాబు ఘటంపైన సహకరించి సభను రసవత్తరం గావించారు.

శ్రీ శ్యామసుందరం జగన్మోహిని రాగంలో "శోభిల్లు సప్తస్వర", సారమతి రాగంలో "మోక్షముకలదా", కాపీ రాగంలో "నీవల్ల గుణదోషమేమి", వసంతరాగంలో "సీతమ్మ మాయమ్మ" కీర్తనలను స్వల్ప స్వరకల్పనలతో వినిపించిన అనంతరం శ్రీ వంకాయల వేంకట రమణమూర్తి మరియు వేంకటేశ్ గారల లయవిన్యాసం ప్రేక్షకులకు మంచి విందును అందించింది. చక్కనైన మంగళం వినిపించి అకాడమీ వార్షికోత్సవాలకు ముక్తాయింపు పలికారు వైణిక విద్వాంసులు.

ఆరు రోజుల సంగీతసభలలో అకాడమీ సభ్యులు శ్రీ వియెస్సెన్ మూర్తి, డా. పేరాల బాలమురళికృష్ణ, శ్రీ వి. నరసయ్య వ్యాఖ్యాతలుగా, విశ్లేషకులుగా బాధ్యతలు నిర్వర్తించగా, సహకార్యదర్శులు శ్రీ. టి. కృష్ణారావు, శ్రీ ఎ. భుజంగరావు, కార్యవర్గసభ్యులు ఎమ్. జ్వాలా శ్రీ ప్రసాద్, శ్రీ యమ్. యమ్. ప్రభు, శ్రీ సి. హెచ్. దుర్గాప్రసాద్ తదితరులు సహకారమందించి కార్య క్రమాల విజయంలో తమ వంతు పాత్ర పోషించారు. అధ్యక్షులు డా. యస్వీ రంగరాజన్, కార్యదర్శి యమ్మెస్ శ్రీనివాస్, కోశాధికారి శ్రీ వి. చంద్రశేఖర్ గారల నిర్విరామ కృషికి తగ్గ ఫలితం లభించినదన్న సంతృప్తి అకాడమీకి కలిగించిన ఈ వేడుకలు విశాఖ రసజ్ఞుల హృదయాలలో నిలచిపోతాయనడానికి సందేహంలేదు.

**- వి. యస్. ఎన్. మూర్తి**

## మనవి

ఈ కోవిడ్ – 19 కారణంగా సంగీత సభా నిర్వహణ దేశంలో ఎక్కడా జరగని కారణంగా గానకళ పత్రికను సక్రమంగా అందచేయలేకపోయాము. ఇకనుండి మరి కొద్ది కాలం ఆన్‌లైన్‌లో పత్రిక వెలువడగలదు. ఈ అసౌకర్యానికి మన్నించగలరు. – పబ్లిషర్